వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 15 ఫిబ్రవరి 2023

## ప్రారంభమైన జీవదారు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



బ్రహ్మంగారి మఠం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

భూత, భవిష్యత్, వర్తమాన కాలజ్ఞానాన్ని రచించి జనులను జాగృతపరిచిన జగద్గురు శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి మఠం ప్రాంగణం నందు మంగళవారం జీవదారు నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం మొదటి రోజు పూర్వపు మఠాధిపతి శ్రీ వీరబోగ వసంత వెంకటేశ్వర స్వామి కుమారులు శ్రీ వెంకటాద్రి స్వామి, భద్రయ్య స్వామి, దత్తాత్రేయ స్వామి, బ్రహ్మయ్య స్వాములతో పాటు మఠం మేనేజర్ ఈశ్వరయ్యాచారి పాల్గొన్నారు. దేవాదాయ శాఖ సహాయ కమీషనర్, ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో జీవదారు ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గతంలోని ధ్వజ స్తంభం సుమారు 10 దశాబ్దాల క్రితం ప్రతిష్ఠించడం జరిగిందని, గత 3 సంవత్సరాల క్రితమే శిథిలావస్థకు చేరుకోవడంతో పాత ధ్వజ స్తంభాన్ని తొలగించి ఆ స్థానంలో నూతన జీవదారు ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం మూడు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో వైభవంగా చేపట్టనున్నట్లు మఠం యాజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో మఠం సిబ్బంది గొడ్లవీటి పరిపూర్ణ, శ్రీను మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వాహనంతో సహా 10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పీలేరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్తః

వాహనంతో సహా 10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్‌స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ వెంకటరమణ తెలిపారు. ఈసందర్భంగా పీలేరు అటవీ శాఖ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరుపతి-బెంగుళూరు బైపాస్‌లోగల రంగంపేట క్రాస్‌వద్ద మంగళవారం వేకువజామున నిఘా ఉంచామన్నారు. ఉదయం 1.50గంటలకు అతి వేగంగా వాహనం తమను చూసి దూసుకుపోవడంతో వెంబడించామన్నారు. తమను చూసి వాహన డ్రైవరు చెర్లోపల్లె వద్ద శ్రీసాయిచైతన్య గ్రానైట్ కటింగ్ యూనిట్ వద్ద వాహనం ఆపి పరారైయ్యారు. ఏపీ39 ఎఫ్ 9227 వాహనాన్ని పరిశీలించగా అందులో 10 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు పరిశీలించామన్నారు. కారుతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి బరువు 313 కిలోలు ఉన్నట్లు విలువ రూ.18లక్షలు గా మతింపు వేశామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పైదాడిలో ఫారెస్టు సిబ్బంది ప్రతాప్.కుప్పుస్వామి, ప్రభుతేజ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నాడు శంకుస్థాపన.. నేడు భూమి పూజ

### - స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి నేడే భూమి పూజ - శంకుస్థాపన నుంచి భూమి పూజకు మూడేళ్లు

### - నేడు జమ్మలమడుగు రానున్న సీఎం





2019 డిసెంబరు 23న జగన్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం, తాజాగా భూమి పూజ జరగనున్న ప్రదేశం, మంగళవవారం సాయంత్రం ప్రాంగణంపై చక్కర్లు కొడుతున్న హెలీకాప్టర్

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:

సీమ వాసుల చిరకాల స్వప్నమైన కడప స్టీల్ ప్లాంట్‌కు సీఎం జగన్ నేడు భూమి పూజ చేయనున్నారు రూ.8800 కోట్లతో 30లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ముందుకు వచ్చింది. సీఎంతో పాటు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ కూడా భూమి పూజ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీంతో సున్నపురాల్లపల్లె వద్ద రెండు హెలీప్యాడ్లు, పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తును అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బహిరంగ సభ ఏర్పాటు చేయకుండా కొద్ది మందితో మాత్రమే సీఎం మాట్లాడనున్నారు.

**శంకుస్థాపన నుంచి భూమి పూజకు మూడేళ్ల సమయం..**

వాస్తవానికి జగన్‌మోహన్‌రెడ్డి తాను ముఖ్యమంత్రి కాగానే కడప స్టీల్ ప్లాంట్‌ను నిర్మిస్తామని ఎన్నికల హామీలో చెప్పారు. ఇచ్చిన మాట మేరకు 2019 డిసెంబరు 23వ తేదీన జమ్మలమడుగు మండల సున్నపురాళ్లపల్లె వద్ద వేల ఎకరాల భూములు కేటాయించిన వైఎస్ఆర్ స్టీల్ కార్పొరేషన్ అథారిటీ పేరుతో ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేశారు.కానీ పనులు ముందుకు సాగలేదు. మూడేళ్ల తరువాత ఇప్పుడు జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి ముందుకు వచ్చింది. ఈ సంస్థకు దీర్ఘకాలిక లీజు ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించింది.

**36 నెలల్లో మొదటి ప్లాంట్ పూర్తి..**

తొలి విడతలో 3300 కోట్ల రూపాయలతో ఏటా పది లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో మొదటి యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జిందాల్ గ్రూప్ ప్రకటించింది. రెండో విడతలో మరో 20 లక్షల టన్నుల ఉత్పత్తి చేసేందుకు ప్లాంటును విస్తరిస్తుంది. మొత్తం 30లక్షల టన్నుల సామర్థ్యంతో పరిశ్రమను అందులో అందుబాటులోకి తేవడానికి జిందాల్ గ్రూప్ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. ప్లాంట్ నిర్మాణం ప్రారంభించిన 36 నెలల్లోనే తొలి యూనిట్‌ను అందుబాటులోకి తేవాలని జేఎస్‌డబ్ల్యూ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

**జిందాల్ కంపెనీకి ప్రభుత్వం చేయూత..**

జిందాల్ కంపెనీ నిర్మించబోయే స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం తన చేయూతను అందిస్తోంది. రాయలసీమ వాసులకు పెద్దఎత్తున ఉపాధి కల్పించే ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.700 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తోంది. ఈ ప్లాంట్‌ను జాతీయ రహదారి 67కు అనుసంధానిస్తూ 7.5 కి.మీ మేర అప్రోచ్ రోడ్డును నిర్మిస్తోంది. ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల రైల్వే లైన్‌ను అనుసంధానిస్తూ పది కి.మీ మేర నూతన రైల్వే ఏర్పాటు చేయనుంది. మైలవరం రిజర్వాయర్ నుంచి రెండు టీఎంసీల నీటిని సరఫరా చేసేలా ప్రత్యేక పైప్‌లైన్ నిర్మిస్తోంది. వీటన్నింటికీ సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపి వీలైనంత త్వరగా నిర్మాణం ముందుకు సాగేలాగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇల కైలాసం.... వీరభద్రుని సన్నిదానం

### -నేటి నుంచే వైభవంగా వీరభద్రుని ఉత్సవాలు



రాయచోటి.ఫిబ్రవరి14 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లాలో ప్రసిద్దిగాంచిన ఆలయాల్లో రాయచోటి వీరభద్రాలయం ఒకటి వీరభద్రుడు భద్రకాళీ సమేత భక్తులు భక్తుల కోర్కెలను తీర్చే స్వామిగా పూజలు ఆదుకుంటున్నాడు. బుదవారం నుంచి 11 రోజులు భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటి పెద్ద ఎత్తున ఏర్పాటు చేసింది. రాచవీడు కాలక్రమేణ రాయచోటిగా మారింది. రాయచోటిలో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రుడు భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న 10, 11వ శతాబ్దంలో రాజాది రాజ చోళుడు ప్రశాంత వాతావరణం కోసం అప్పటి మాండవ్యనది పరివాహ ప్రాంతంపై ఆయన దృష్టి వెళ్లింది. అప్పట్లో ఈ ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతంగా ఉండేది. సెలయేటి ఇసుకదిన్నెలా నది ప్రవాహం ప్రాంతంలో ఒక ఆశ్రమాన్ని నిర్మించుకున్నారు. రాజు వెంట వచ్చిన మంది మార్బలంతో ఒక ఊరుగా ఏర్పడింది. రాజులు ఉండే ఊరు రాచవీడని రాజులు తిరిగే రాజబాటను నానుడి అనంతరం రాజ చోళుడు ఉన్న ప్రాంతమే రాచవీడుగా రూపొందినట్లు కథనం శైవ భక్తుడైన చోళ రాజు మాండవ్య నది పరివాహ ప్రాంతంలో వీరభద్రుని ప్రతిమ ప్రతిష్ఠించాడు అని తెలుస్తోంది. కాగా దశ ప్రజాపతి కుమార్తె శంకరుడి అర్థాగ్ని సతీదేవి అగ్నిలో ఆహుతైనప్పుడు పరమశివుడి ఉగ్రుడై బ్రహ్మాండం బద్దలు అయ్యేలా ఓంకారము చేసి తన జటా జటమునందలి ఒక జటను తీసి పర్వతానికి కొట్టగా కోటి సూర్య ప్రకాశాంతో కలిగి భద్రకాళీ వీరభద్రుడుగా ఉద్భవించినట్లు పురాణ కథనం శివుని ఆజ్ఞ మేరకు దక్షయాగం చేసి అనంతరం భక్తులు రక్షణకు రాచవీడులో కొలువయ్యాడని పురాణాలు చెబుతున్నాయి. చోళుడు ప్రతిష్ఠించిన ఈ ఆలయ కాకతీయ రాజులసై నిర్మితమైనట్లు తదుపరి తుల వంశపు చక్రవర్తి శ్రీకృష్ణదేవ రాయులుచే 1484లో పునరుద్దరించినట్లు చరిత్రకారులు పేర్కొన్నారు. అపురూప కళా శిల్ప వైభవంతో ఉట్టిపడే ఈ ఆలయం భద్రకాళీ వీరభద్రునితో పాటు వినాయకుడు శివుడు కాలభైరవుడు చండీశ్వరుడు శని గ్రహాలు ఉన్నాయి. ఆలయానికి తూర్పు దిశలో 56 అడుగుల దీప స్థంబం చూపర్లును ఆకట్టుకుంటుంది. ఇంత పెద్ద ఏకశిలా దీప స్థంబం దక్షిణ భారతదేశంలోనే మరెక్కడా లేదని చెప్పవచ్చు. ప్రతి ఏటా కార్తీక మాసంలో ఈ స్థంబంపై భాగంలో దీపం వెలగించి స్వామి వారిని ఆరాదించడం ఆనవాయితీగా వస్తుంది. దక్షిణ కాశీగా ప్రసిద్దిగాంచిన ఈ క్షేత్రంలో వీరభద్రుని పూజిస్తే కష్టాలు తొలిగుతాయని భక్తుల విశ్వాసం కర్ణాటక భక్తులు విలవేల్పుగా ఆలయ అభివృద్దికి వారి కృషి ప్రశంసనీయం. శివరాత్రి మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలులో భక్త సందోహంతో రాయచోటి పట్టణం కళకళలాడుతుంది. హిందువులే కాక ముస్లింలు సైతం ఆలయానికి విచ్చేస్తారు. ఈ బ్రహ్మోత్సవాలు శివరాత్రితో ముడిపడి మహా నైవేద్యంతో ముగుస్తాయి.

## బస్టాండ్ కూడలిలో మరుగుదొడ్లు ఏర్పాటు ఎప్పుడో?

### నిత్యం వందల సంఖ్యలో ప్రయాణిస్తున్న ప్రజలు - 2 సంవత్సరాల ముందు మరుగుదొడ్ల ఏర్పాటుకు స్థల సేకరణ

### ఇంతవరకు ఆచరణ నోచుకోలేదు



మరుగుదొడ్ల కోసం సేకరించిన స్థలం ఫైల్ ఫొటో

నందలూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతిలోని బస్టాండు కూడలి నందు ప్రజా సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలని స్థానిక ప్రజలు పంచాయతి అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు విన్నవించుకొన్నా ఫలితం లేదు. స్థానికంగా ఉన్న బస్టాండు నందు నిత్యం వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. మండల కేంద్రంలో ప్రతినిత్యం ఎన్నో బస్సులు ఆగి వెళుతుంటాయి. ఏదైనా అత్యవసరమై కాలకృత్యాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. మరుగుదొడ్లు నిర్మించేందుకు స్థలం ఉన్నప్పటికి అందులో నిర్మాణం చేసేందుకు అధికారులు ముందుకు రాకపోవడం చాలా దయణీయమని, రెండు సంవత్సరాల నుండి కాలయాపన చేస్తున్నారే తప్ప వాటిని నిర్మించడంలో అధికారులు, నాయకులు తమ బాధ్యతను విస్మరించారని ప్రయాణికులు, ప్రజలు అంటున్నారు. పేరుకేమో పెద్దమండలం. ఎమ్మెల్యే సొంత మండలం అయినప్పటికీ అభివృద్ధికి ఆమడదూరంలో ఈ మండలం ఉండడం శోచణీయం. ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి వరకు కొన్ని వందల మంది ప్రయాణిస్తుంటారు. పురుషులైతే ఎక్కడోచోట కాలకృత్యాలు తీర్చుకొంటున్నారు. మహిళా ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోయింది. సమస్యను బయటకు చెప్పుకోలేక నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు మరుగుదొడ్లు నిర్మించలేని స్థితిలో ఉంటే ఆ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పితే కొంతమంది మేము నిర్మిస్తామని అంటున్నారు. దీనిపై అధికారులు, నాయకులు సమాలోచించి నిర్మించడమా, ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ఏదోకటి చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుకుంటున్నారు.

## విద్యుత్తు సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్నబొగ్గిడివారిపల్లె గ్రామ సచివాలయం

### - రూ.40లక్షలు వెచ్చించిన భవనం నిరుపయోగం



సిద్దవటం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రజలకు త్వరితగతిన సంక్షేమ పథకాలను అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొని వచ్చింది. గ్రామ సచివాలయంలో పది మంది సిబ్బందిని నియమించి ప్రజలకు అవసరమైన పనులను సకాలంలో జరిగేందుకు వీలు కల్పించింది. ఇంత ప్రాముఖ్యత సంతరించుకున్న గ్రామ సచివాలయ భవనం గత సంవత్సరం అక్టోబరు 24న రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి చేత ప్రారంభానికి నోచుకోని విద్యుత్తు సౌకర్యం లేక నిరుపయోగంగా మారింది. విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేసేందుకు విద్యుత్తు ఏఈ సుమారు రూ.లక్ష ప్రభుత్వానికి చెల్లించాలని తెలపడంతో గ్రామ సచివాలయంలో నిధులు లేక గ్రామ సచివాలయం నిరుపయోగంగా మారిందని గ్రామ ఉప సర్పంచ్ గునుగుంట్ల ఎల్లారెడ్డి పేర్కొన్నారు. గ్రామ ఉప సర్పంచ్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి ఇంకా రూ.7లక్షలు బిల్లులు కూడా ప్రభుత్వం నుంచి రావాలల్సి ఉందన్నారు. గ్రామ పంచాయతీలో నిధులు లేక ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నామన్నారు. బొగ్గిడివాంరిపల్లె గ్రామ సచివాలయానికి ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలి

### జెసి సీఎం సాయికాంత్ వర్మ



బద్వేలు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించాలని జేసీ సీఎం సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగవారం కాలెక్టరేట్‌లోని విసి హాలులో.. ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల.. నిర్వహణ సన్నద్ధతపై కడప నగర కమీషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, డిఆర్వో గంగాధర గౌడ్ లతో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో జేసీ సాయికాంత్ వర్మ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గతంలో జరిగిన ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో మార్చి 13వ తేదీన జరిగే.. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ 15వ తేదీ లోపు పూర్తి చేసి.. తుది ఓటరు జాబితాను విడుదల చేయాలన్నారు. నిర్దేశించిన తేదీల్లో ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శిక్షణకు సంబందిత అధికారులు తప్పకుండా హాజరై.. ఎన్నికలు జరిగే.. ఆయా మండలాలకు సంబంధించి సెన్సిటీవ్, హైపర్ సెన్సిటీవ్ పోలింగ్ కేంద్రాలను వెంటనే గుర్తించాలన్నారు. పోలింగ్ సిబ్బందిగా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు కానీ వారిని మాత్రమే నియమించాలన్నారు. వారి సొంత మండలం కానీ, వారు విధులు నిర్వహించే మండలానికి కానీ.. విధులు కేటాయించకూడదన్నారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు.. భద్రతగా ఏర్పాట్లను కూడా సంసిద్ధం చేసుకోవాలన్నారు. ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి పోలింగ్ సామాగ్రి, స్ట్రాంగ్ రూము, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కౌంటర్లు, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్ల విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సంబందిత కేంద్రాల్లో గట్టి భద్రతా చర్యను చేపట్టాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక సూచనల మేరకు ఎన్నికల మోడల్ కోడ్ నియమావళిని తూచా తప్పక పాటించేలా పోలింగ్ నిర్వహణ సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు. సెన్సిటీవ్, హై సెన్సిటీవ్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా కేంద్రాలకు అదనపు భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియోగ్రాఫర్, మైక్రో అబ్జర్వర్ లను, రూట్ ఆఫీసర్లు, సెక్టోరల్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లను నియమించాలన్నారు. అలాగే పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధులను కేటాయించిన స్థానాలను తెలియజేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు.

## అప్పులు రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ -జగన్‌కు పరిపాలనా పరిజ్ఞానం లేదు

### -ప్రభుత్వంపై ధ్వజమెత్తిన రమేష్‌కుమార్‌రెడ్డి



రాయచోటి.ఫిబ్రవరి14 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ అప్పులు రాష్ట్రంగా మారిందని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేతకాక రాష్ట్రాన్ని అదోగతి చేస్తున్నారని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం రాయచోటి మండలం దిగువ అబ్బవరం కమ్మపల్లిలో రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులతో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇంటింటికి తిరిగి స్వయంగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన చెప్పారు. ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటి అసెంబ్లీలో అధికార పార్టీకి చెందిన మంత్రులు ఎమ్మెల్యేలు బూతులు మాట్లాడుతుంటే రాష్ట్ర ప్రజలు సిగ్గుతో తలదించుకునే పరిస్థితి నెలకొందని అన్నారు. 151 మంది ఎమ్మెల్యేలను గెలిపించి అధికారం కట్టబెడితే వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాలలో బ్రస్టు పట్టించిందని ఆరోపించారు. మూడన్నర సంవత్సరాల నుంచి బిసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వివిద కులవృత్తులు చేసుకుంటూ జీవనం సాగించే బీసిల అభివృద్ధి కనుమరుగైపోయిందన్నారు. సిపిఎస్ రద్దు మద్యపాన నిషేదం పై మాట తప్పి మడమతిప్పడం లాంటి ప్రజా గ్రహ నిర్ణయాలు వలన ఇదేమి కర్మ రాష్ట్రానికి అని మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షులు జి.సుబ్బయ్య నాయుడు, శ్రీనివాసులునాయుడు, చిట్టి వెంకటరమణ, చిన్న పురెడ్డి, రామచంద్ర, ప్రదీఫ్‌రాయల్, బోనమలఖాదర్‌వలి, మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పేరుకే ప్రభుత్వ దవాఖానా..!

### రోగులు ఎక్కువ.. వైద్యులు తక్కువ..! ఉన్న వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్‌లో నిమగ్నం!

### -రోగుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు - ఇంత వరకూ ప్రారంభం కాని పెద్ద భవనం

### -పాత భవనంలోనే వైద్య పరీక్షలు - ప్రైవేట్ వైద్యం వైపు పరుగులు



ప్రారంభం కాని నూతన భవనం.

బద్వేలు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

ప్రభుత్వ దవాఖానాలో సరైన వైద్యం లేక రోగులు ప్రైవేట్ వైద్యం వైపు పరుగులు తీస్తున్నారు. కోట్ల రూపాయలు వైద్యం కోసం ప్రభుత్వం ఖర్చు పెడుతుంటే వైద్యం అందించే వైద్యుల నిర్లక్ష్యం వల్ల ప్రైవేట్ వైద్యం వైపు అప్పులు చేసి అయినా పరుగులు తీస్తున్నారు. బద్వేలు ప్రభుత్వాసుపత్రి పేరుకే పెద్ద దవాఖాన. సేవల్లో మాత్రం శూన్యం. నిత్యం 300 మందికి పైగా ప్రజలు చికిత్సల కోసం వెళుతుంటారు. వారికి తగ్గ డాక్టర్లు లేక వెనుదిరిగి పోవడమే వారు కొంత మంది, ఉన్న దాంట్లోనే సర్దుకొని పోయేవారు కొంత మంది. ప్రభుత్వ దవాఖానలో అన్ని వసతులు కల్పిస్తున్నాం, ప్రైవేట్ వైద్యం అవసరం లేదు, కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టి దవాఖానాలు నిర్మిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో సరైన వైద్యం అందడం లేదు. రోగులు ఎక్కువ, వైద్యులు తక్కువ అన్నట్లుగా తయారైంది బద్వేలు ప్రభుత్వ సీమాంక్ ఆసుపత్రి పరిస్థితి. ఆసుపత్రి వచ్చేవారు డాక్టర్లను చూసి వెనుదిరిగి పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రైవేటు వైద్యం అందించే విధంగా ప్రభుత్వ వైద్యం అందడం లేదనే విమర్శలు బలంగా వినపడుతున్నాయి. దీనికి తోడు ఆసుపత్రిలో కొంత మంది మాత్రమే డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన వారిని ఇంత వరకూ ప్రభుత్వం భర్తీ చేయలేదు. ఇదిలా ఉంటే ఉన్నవారు కూడా సెలవులు పెట్టి ప్రైవేట్ ప్రాక్టీస్ చేయడం, మరి కొంత మంది ప్రభుత్వ వైద్యం అందిస్తూ ప్రైవేటు ఆసుపత్రులలో ప్రాక్టీస్ నిర్వహిస్తున్నారు. నామామాత్రపు వైద్య సేవలు తప్ప రోగులకు సరైన వైద్యం పూర్తిస్థాయిలో అందడం లేదనే విమర్శలు గత కొద్ది రోజులుగా వినపడుతున్నాయి. కోట వీధిలో ఉన్న ఆసుపత్రిని తెచ్చి కుంటలో సీమాంక్ ఆసుపత్రి నిర్మించారు. కొన్నేళ్లు అవుతున్నా ఇంత వరకూ పాత భవనంలోనే వైద్య సేవలందిస్తున్నారు తప్ప కొత్త భవనంలోకి వెళ్ళలేదు. గత 10 సంవత్సరాల క్రితం కొత్త భవనానికి టెండర్లు పిలిచి వేగవంతంగా నూతన దవాఖాన నిర్మించాలని ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటికి పూర్తయి ఏండ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. ఇది అధికారుల నిర్లక్ష్యమా? లేక ప్రజా ప్రతినిధుల అలసత్వమో? తెలియదు కానీ రోగులు నలిగి పోతున్నారు. బద్వేలును డివిజన్ స్థాయిగా మార్చారంటే ఇక్కడ సేవలు ఏ విధంగా ఉండాలి? కానీ వాటికి తగ్గ సేవలు కనపడడం లేదని పలువురు రోగులు మండి పడుతున్నారు. ఇంత పెద్ద పట్టణానికి ఇంద పెద్ద ఆసుపత్రిని ఏర్పాటు చేశారే గానీ అది ప్రారంభం కాలేదు. ఒక పక్క రోగులకు సరైన వైద్యం లేక అవస్థలు, డాక్టర్లు ఉన్నా ప్రైవేట్ ప్రాక్టీస్ వైపు పరుగులు. రోగుల సంఖ్య పెరుగుతున్నా పెరగని వైద్యులు, ఇలా కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ దవాఖానలో వైద్య సేవలపై పలు విమర్శలు విన్పిస్తున్నాయి. ఒకరిద్దరు వైద్యం చేసినంత మాత్రాన వందల మంది రోగులకు వైద్యం అందించడం సామాన్యమైన పని కాదు. అంతే కాకుండా ఇంత పెద్ద దవాఖానాకు వివిధ రకాల చికిత్సలు అందించే వైద్యులు ప్రత్యేకంగా ఉండవలసిన ఆసుపత్రికి సమానంగా ఒకటే వైద్యం అందించే డాక్టర్లు ఉంటే వైద్యం ఎలా ముందుకు సాగుతుంది. కంటికి, చెవికి, ముక్కుకు, గుండెకు, గర్భిణీలకు, చిన్న పిల్లలకు ప్రత్యేకంగా డాక్టర్లు ఉండవలసి ఉన్నప్పటికీ కొంత మంది మాత్రమే ఉంటున్నారు. అంతే కాకుండా అనేక చికిత్సలకు సంబంధించిన డాక్టర్లు ఇంత వరకూ లేకపోవడం దురదృష్టకరం. ఈ ప్రభుత్వ దవాఖానాలో ఎప్పుడు పూర్తి వైద్యం అందుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.




పాత ఆసుపత్రిలోనే వైద్య సేవలు, డాక్టర్లు లేకపోవడంతో తగ్గుతున్న రోగుల సంఖ్య.

## రాయలసీమకే తలమానికం బీరంగి బండెన్న స్వామి ఆలయం

### 138 విగ్రహాలతో పర్యాటకంగా అభివృద్ధి



బి. కొత్తకోట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

తంబల్లపల్లి నియోజకవర్గంలో మునిపెన్నడు లేనివిధంగా లక్ష్మీపతి స్వామి, ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన శ్రీ బండెన్న స్వామి ఆలయం రాయలసీమకే తలమానికంగా విరాజిల్లుతుంది. అన్నమయ్య జిల్లా తంబల్లపల్లి నియోజకవర్గం బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామంలో గూగుట్ట కొనలో వెలసిన బండెన్న స్వామి ఆలయంలో ఈ నెల మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎన్నడులేని విధంగా అత్యంత వైభవంగా 17 నుంచి 19 తేదీ వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. 17 న శివకోటి అర్చన అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. 18 మహాశివరాత్రి రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. 18 రాత్రి సాసవల చిన్నమ్మ కథ చెపుతారు. 19 న ఉపవాస కార్యక్రమం ఉంటుందని ఆలయ పీఠాధిపతి లక్ష్మీపతి స్వామి తెలియచేశారు. భక్తి భావం దైవారాధన పెరిగిన రోజుల్లో విశిష్టత పద్ధతులతో నిర్మించిన బండెన్న స్వామి ఆలయానికి పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు రాస్త్రాల నుంచే కాకుండా నలుమూల నుంచి కూడా భక్తులు వచ్చి పూజలు నిర్వహిస్తుంటారు.బండెన్న స్వామి ఆలయ వివరాల్లోకి వెళితే బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామములో లక్ష్మీపతి స్వామి టికొట్టు నడుపుతూ వ్యవసాయం చేసుకుంటు తన తల్లిదండ్రులతో జీవనం సాగించేవారు. ఒక రోజు దినచర్యలలో భాగంగా తన తండ్రితో కలిసి పొలంలోమడకతో దుక్కిదున్నుతుండగా ఆకస్మికంగా మడక దున్నతున్న ఎద్దులు బెదిరిపోయి పరుగులు పెడుతుండడంతో అటుగా లక్ష్మీపతి స్వామి కూడా వాటి వెంట పరిగెత్తసాగాడు. ఎక్కడికి పోతున్నావ్ అగు అనే కంటికి కనపడని పలుకులతో ఓ శబ్దం వినపడడంతో లక్ష్మీపతి స్వామి వెనుతిరిగి చూడగా రెండడుగుల శ్రీ బండెన్న స్వామి రాతి విగ్రహం కనిపించడం జరిగింది. అప్పటి నుంచి ఆ విగ్రహానికి పూజలు చేస్తూ వుండేవారు. ఒకరోజు బండెన్న స్వామి నిధురించు సమయాన బండెన్న స్వామి స్వప్నంలో కనబడి ఇలా చెప్పడం జరిగింది. నాకు బీరంగి గ్రామంలో గూగుట్ట కొనలో ఆలయం నిర్మిస్తే భక్తుల కోర్కెలు తీర్చే దేవుడు గా ఆలయంగా పూజలు అందుకుంటానని , సంతానం లేనివారికి సంతాన ప్రాప్తి ప్రసాధిస్తానాని చెప్పడంలో అప్పటి నుంచి 2014 సంవత్సరం అక్టోబర్ 9 వ తేదీన బండెన్న స్వామి నిర్మాణము చేపట్టారు. ఆనాటి నుండి (మిగతా IIవ పేజీలో)

## జనసేన పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం

మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



పట్టణంలోని జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మైపోర్స్ మహేష్ పిలుపునిచ్చారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాన్ ప్రారంభించిన పార్టీ క్రీయాశీలక సభ్యత్వ నమోదును జనసైనికులు విజయవం తం అయ్యేలా చూడాలన్నారు. జనసేన పార్టీలో పనిచేస్తున్న కార్యకర్తలతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఆపద సమయంలో అపన్నహస్తం అందించే విధంగా జనసేన పార్టీ క్రీయాశీలక సభ్యత్వం రూపొందించడం జరిగిందని కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. అందరూ కష్టపడి రాష్ట్రంలోనే మదనపల్లె నియోజకవర్గం మొదటి స్థానంలో నిలపాలని కోరారుర. ఈ కార్యక్రమంలో జనసేన చిత్తూరు జిల్లా లీగల్ జిల్లా అధ్యక్షులు అమర నారాయణ, జనసేన నాయకులు సందీప్, ప్రవీన్, గంగాదర్, అయ్యాజ్, ధరణి, తేజ మహిళా నాయకురాలు మల్లిక, రూప పాల్గొన్నారు.

## పుల్వామా అమర వీరులకు నివాళులు

### హెల్పింగ్‌మైండ్ సంస్థచే రక్తదాన శిబిరం

మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో హెల్పింగ్‌మైండ్ సంస్థచే పుల్వామా అమర వీరుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిభిరం నిర్వహించారు. పుల్వామా ఘటనలో ప్రాణాలు అర్పించిన ప్రతి ఒక్క వీరునికి జోహార్లు తెలిపారు. ఎంతో మంది గర్భిణీ, మహిళలు, ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి హెల్పింగ్ మైండ్ సభ్యులు దానం చేసిన రక్తం ఉపయోగపడితే చాలని సంస్థ వ్యవస్థాప కులు అబూబక్కర్ సిద్దిక్ తెలిపారు. 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా ఘటన యావత్ భారతదేశాన్ని శోకసందంలో నింపిందని దీనికి నివాళులు అర్పి స్తున్నట్లు అబూబక్కర్ సిద్దిక్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు షాబాన, పవన్, సునీల్, రమేష్, షాహీద్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలి

మైదుకూరు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



పుల్వామా అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వేదవ్యాస హైస్కూల్ నందు పుల్వామా దాడి లో అమరులైన వీరసైనికుల చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మైదుకూరు పురపాలక కమిషనర్ రాముడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశం పట్ల అంకితభావం కలిగి ఉండవలేనని, దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగానికి కైనా సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ సైని కులు వంకెల రామ సుబ్బారెడ్డి, కర్రె పుల్లయ్యలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో వాగ్దాడం శివశంకర్, ఆదరణ సేవాసంస్థ కిన్నెర ప్రసన్నకుమార్, ఇమ్మడిశెట్టి సతీష్ బాబు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు పోలిశెట్టి శివకుమార్, కృష్ణారెడ్డి , పాఠశాల కరస్పాండెంట్ బర్రె రామిరెడ్డి పాల్గొన్నారు.

## జగన్ పర్యటనను అడ్డుకోండి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:

ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ భూ బాధితుల విషయంలో గత టీడీపీ హయాంలో అన్యాయం జరిగిందని, అప్పటి వైసీపీ నేత సుధీర్‌రెడ్డి అధికారంలో కూర్చున్న తరువాత న్యాయం చేస్తానని హామీ ఇచ్చి ఇప్పటికి దాదాపు ఐదేళ్లు గడుస్తున్నా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారని దీనిలో జగన్ కూడా బాధ్యత తీసుకోవాలని అప్పటి కేసులో ఇప్పటికీ ఏసీసీ బాధితులు తిరుగుతూ ఉన్నారని దాదాపు 60 మంది కేసులో ఉన్నారని, ఇప్పటికీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంలో ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం విఫలమైందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్సాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకనలో విమర్శించారు. సిమెంటు ఫ్యాక్టరీ వస్తుందా లేకుంటే భూములు వెనక్కి ఇస్తారా తేల్చి చెప్పాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే, సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రేపు జమ్మలమడుగు పర్యటనలో సీఎం ఈ విషయంలో ప్రకటన చేయాలని అలా కానీ పక్షంలో ఇదే సభలో ఏసీసీ బాధిత రైతులతో నిరసన వ్యక్తం చేస్తామని తెలియజేస్తున్నామన్నారు.

## వివేకా హత్యలో నిజనిజాలు తేటతెల్లమవుతున్నాయి

### – తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



వివేకా హత్య కేసులోని నిజాలు ఆలస్యం అయినా తేట తెల్లంఅయినాయి నిందితులు ఎవరైంది అందరికీ తెలిసినదని జమ్మలమడుగు తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వివేకా హత్య విషయంలో తమ కుటుంబంపై తప్పుడు ఆరోపణలు చేసి వారి పత్రిలో ప్రచురించడం ధారుణమన్నారు. నిజాలు నిలకడగా తెలుస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రమణారెడ్డి, భూసిరెడ్డి, తులసిరెడ్డి, శంకర్‌రెడ్డి, ఖదీర్, రాజారెడ్డి, అంకాల్, సురేంద్రరెడ్డి, అలీ, గోపాల్, భాస్కర్, దాషి పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ

వేంపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :

వేంపల్లె పట్టణంలోని నిరుద్యోగ యువతి, యువకులకు చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాదుకు చెందిన అభయ ఫౌండేషన్ సహాయ సహకారంతో 20 రోజుల శిక్షణ, పది రోజుల తరగతులు నిర్వహిస్తారన్నారు. వేంపల్లెలోని బిఎస్ఆర్ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్ నందు శిక్షణ ఇచ్చి ఎల్ఎల్ఆర్, సర్టిఫికెట్లు ఇస్తారని తెలిపారు. పదో తరగతి ఆపైన పాసైన అభ్యర్థులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లు తీసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



కడప జిల్లా మైదుకూరు వయా పోరుమామిళ్ల మీదుగా అమరావతికి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు పోరుమామిళ్ల పట్టణంలో దాదాపు. 25కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో పనులు వేగవంతంగా చేసి ప్రయాణికులకు, ప్రజలకు, వాహనాదారులకు ఇబ్బందులు లేకుండా చేయవలసి ఉంది. కానీ సంబంధించిన కాంట్రాక్టర్ విస్తరణ పనులు నత్త నడకన చేయడంతో వాహనాలకు. ప్రజలకు ఇబ్బంది కరంగా మారింది. రోజు ట్రాఫిక్ జామ్ కావడంతో విద్యార్థులు. సమయానకూలంగా పాఠశాలలకు, కళాశాల లకు పోలేక ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు ప్రయాణికులు తమ గమ్యానికి చేరలేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పోలీసు లకు కూడా తల భారంగా మారింది. రోజు పోరుమామిళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ రెడ్డి. మరియు తమ సిబ్బందితో ఫుట్ పెట్రోలింగ్ చేస్తున్నారు. అయినా ట్రాఫిక్ జామ్‌తో వాహనాదారులను నియంత్రించలేక పోతున్నారు. సంబంధించిన కాంట్రాక్టర్‌ని లక్ష్యంతో విస్తరణ పనులు వేగవంతంగా చేయక పోవడంతోనే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని విస్తరణ పనులు వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## రైతుల సమస్యల పరిష్కారమే రైతు సేవా సమితి

మైదుకూరు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



కడప జిల్లాలో రైతాంగా సమస్యల పరిష్కారమే రైతు సేవా సమితి, ప్రధాన ఉద్దేశం అని సమితి ప్రధాన నాయకుడు ఎ వి. రమణ అన్నారు. జిల్లాలో ఎరాజ కీయ పార్టీకి అనుబంధంగా లేకుండా సీనియర్ రైతు నాయకుడు ఎ.వి.రమణ. నాయకత్వంలో స్వాతంత్రంగా ఉద్యమిస్తున్న రైతు సేవాసమితిని ప్రజాస్వామ్య పద్దతిలో మండల, నియోజకవర్గ, జిల్లా, కమిటీలను ఎన్నుకోవడంలో భాగంగా సభ్యత్వం నమోదులో మంగళవారం తొలి సభ్యత్వం నందు మైదుకూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బిపి. సుధాకర్ రెడ్డిని మొట్టమొదటగా నమోదు చేసు కోవడం జరిగింది. నిర్మాణం అనంతరం జిల్లాలోని పెండింగ్ నీటీ ప్రాజెక్టుల పైన, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అర్హత ఉండి పొందలేని వారి పక్షనా రైతు సేవా సమితి ఉద్యమిస్తుందని రమణ తెలిపారు. కార్యక్రమంలో రైతు నాయకులు రామాంజనేయులు, కత్తిగిరెడ్డి, రాజ, రాంమోహన్, గోశెట్టి రమణయ్య. పాల్గొన్నారు.

## రైతులు బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

### డిసిసి బ్యాంక్ సీఈవో రాజేంద్ర కుమార్

రాయచోటి.ఫిబ్రవరి14 ప్రభాతవార్త



జిల్లాలోని రైతులందరూ బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికం గా అభివృద్ది చెందే విధంగా బ్యాంక్ మేనేజర్లు రైతులకు సహకారం అందించాలని డిసిసి బ్యాంక్ సీఈవో రాజేంద్రకుమార్ బ్యాంకర్లుకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స ్పందన హాల్లో వ్యవసాయ జేడి ఉమా మహేశ్వరమ్మ అధ్యక్షతన జిల్లా స్థాయి టెక్నికల్ కమిటి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డిసిసి బ్యాంక్ సీఈవో రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ 2023-27 ఆర్థిక సంవత్స రానికి గాను రబీ, ఖరీఫ్ సీజన్‌లలో రైతులు సాగు చేసే పంటల వ్యయానికి తగ్గట్టుగా బ్యాంకుల రుణ సౌకర్యం కల్పించి సహకరించాలని బ్యాంకర్లుకు సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ అన్నమయ్య జల్లాలో రైతులు సాగు చేసే వివిధ పంటలకు సంబందించి పంటల సాగు వ్యయానికి తగ్గట్టుగా రుణ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాబార్డ్ డిబిడి విజయ విహారి, ఎల్‌డిఎం వెంకటేశ్వరరెడ్డి, వ్యవ సాయ శాఖ అధికారులు

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వేంపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :



ప్రతి ఒక్కరు వయసుతో సంబంధం లేకుండా యోగ, ప్రాణాయామం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం దక్కుతుందని సీహెచ్‌వో వెంకటరత్నం, సూపర్ వైజరు వెంకటలక్ష్మిలు అన్నారు. తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేంపల్లె జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయు ష్మాన్ భారత్ ఆరోగ్యమేళా వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా ఉచి తంగా అందిస్తున్న ఆరోగ్యసంరక్షణ సేవలు, ల్యాబ్‌సేవలు, ఉచిత మందులు, ఆరోగ్య గుర్తింపు నంబరు జారీ, మాతా శిశు సంరక్షణ, సేవల గురించి వివరించారు.

## ఆదర్శప్రాయుడు సంజీవయ్య

వేంపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :



స్వాతంత్ర్య సమరయోధుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఏఐసీసీ అధ్యక్షుడు దామోదరం సంజీవయ్య ఆదర్శ ప్రాయుడని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో దామోదరం సంజీ వయ్య 102వ జయంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవయ్య అసలు సిసలు కాంగ్రెస్ వాది అన్నారు. కాంగ్రెస్ పార్టీ పురోభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, చెన్నకేశవ, ఉత్తన్న, బద్రి రాఘవయ్య, శివ పాల్గొన్నారు.

## ఉచిత గ్రహణమొర్రి ఆపరేషన్లు

పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్. గీత, తోమాస్ రెడ్డి చిత్త దంపతుల ఆధ్వర్యంలో హైదరాబాదు పట్టణంలోని ఎల్బీనగర్ సమీపంలో హాస్పిటల్‌లో ఈనెల 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు ఉచిత గ్రహణ మొర్రి ఆపరేషన్లు జరుగుచున్నవి. ఈ క్యాంపునకు 33 మంది గ్రహణమొర్రి బాధిత చిన్నారులు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి రావడం జరిగింది. వీరందరికీ 13వ తేదీ స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి ఆపరేషన్లు చేస్తున్నారు. ఈ క్యాంపునకు వచ్చిన పిల్లల తల్లి దండ్రులకు డాక్టర్. గీతా సలహాలు సూచనలు ఇచ్చారు. ఆపరేషన్ అనంతరం పిల్లలను 15 రోజులపాటు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా 2000 మంది గ్రహణమొర్రి బాధిత చిన్నారులకు ఆపరేషన్లు చేయించామన్నారు. కార్యక్రమానికి హాజరైన చిన్నారుల తల్లిదండ్రులు టామ్ చిత్త, డాక్టర్. కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందాలి

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రతి గడప వద్దకు చేరేలా బూత్ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు బాధ్యతగా కృషి చేయాలని మున్సి పల్ కన్వీనర్ ఈగ యద్దారెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు సింగసాని శివయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ సచివాలయంలో 5వ వార్డు గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ వాలంటీర్లు ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటి ముంగిటకే చేరేలా కృషి చేస్తూ గత ప్రభుత్వం లో అభి వృద్ధిని, ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధిని ప్రజలకు వివరించాలని వారు తెలియజేశారు. అనంతరం పలువురు గృహ సారథులు, కన్వీనర్లకు వారు పలు రకాల సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సింగ సాని రాజేష్, సనిశెట్టి సుజాత, కృష్ణ, సిద్దయ్య, లక్ష్మీ నారాయణ, వెంకటసుబ్బయ్య, రవి, సంటెయ్య పాల్గొన్నారు.

## మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పీలేరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్తః

ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సిబ్బంది మద్యం అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్స్‌పెక్టర్ గుంటూరు రామకష్ణశాస్త్రి హెచ్చరించారు. ఈసందర్భంగా చిత్తూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ దయాసాగర్ , డిపో ఇన్స్‌పెక్టర్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు మంగళవారం ఆయన రొంపిచెర్లలో గల రెండు మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. మందు బాటిళ్ల స్టిక్కర్లను స్కాన్‌చేసి ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజు అమ్మకాలు జరిపిపైకాన్ని తప్పనిసరిగా మరుసటిరోజు బ్యాంకులో సకాలంలో చలానా రూపంలో చెల్లించాలన్నారు. తనిఖీల సమయంలో సిబ్బంది విధులకు హాజరుకాకుంటే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. షాపుల్లో ఉన్న నిల్వలను రికార్డులను తనికీచేశారు. తనఖిలో డిపో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, లోకనాథం, సైపర్‌వైజర్ పాల్గొన్నారు.

## కార్మికుల ఆకలి బాధలు ప్రభుత్వాలకు పట్టదా?

పోరుమామిళ్ల రూరల్ ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



స్వచ్ఛభారత్ కార్మికుల ఆకలి కేకలు ప్రభుత్వాలకు పట్టవా, పది నెలలు కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఏ విధంగా జీవించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, సిపిఐ మండల కార్యదర్శి రవి కుమార్ అధికారులపై మండిపడ్డారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ కార్మికుల రాష్ట్ర పిలుపులో భాగంగా పోరుమామిళ్ల ఏఐటీయూసీ మండల సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలపై ఈఓపిఆర్‌డి భాస్కర్ బాబుకు సోమ వారం వినతిపత్రం అందించడం జరిగింది. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మికులు రామయ్య, శ్రీరాములు, యోహాన్, దానం, ఓబయ్య, వెంకటేష్, ప్రసాదు పాల్గొన్నారు.

## క్రీడాకారులను అభినందించిన అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



టెంపుల్ ఆఫ్ తైక్వాండో భారత్ మాస్టర్ విజయ్ భాస్కర్‌రెడ్డి, గోపి నాయుడు ఆధ్వర్యంలో తిరుపతిలోని విశ్వం హైస్కూల్లో ఈనెల 11, 12 తేదీల్లో ఓపెన్ తైక్వాండో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కడపకు క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారు. మంగళవారం అఫ్జల్‌ఖాన్ మెడల్ సాధించిన విద్యార్థులను ప్రశంసించి మెడల్స్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జమాల్‌వల్లీ పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్ళి జాలరి మృతి

కాశినాయన, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



మండలంలోని ఉప్పలూరు గ్రామ సమీపంలో ఉన్న సగిలేరులో చేపల వేటకు వెళ్ళిన బోయన వెంకట రామయ్య (55) అనే వ్యక్తి మృతిచెందాడు. సోమ వారం సాయంత్రం సగిలేరులో చేపల వల వేసి ఇంటికి వస్తున్న జాలరు వెంకట రామయ్య మరుసటి రోజు ఉదయం వల తీసేందుకు వెళ్ళగా ఎంత సమయం గడిచినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తు లతో కూడి సగిలేరులో గాలించారు. అక్కడ గాలించగా సగిలేరులో శవమై కన్పించడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఆరోగ్యానికి భరోసా ప్రగతికి హామీ

### – డిప్యూటీ డిఎంహెచ్‌వో డా॥ చంద్రహాస రెడ్డి

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



మున్సిపాలిటీలో ఆయుష్మాన్ భారత్ క్రింద ఆరోగ్య మేల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో సైకిల్ ర్యాలీ చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం డిప్యూటీ డిఎంహెచ్‌వో డా॥ చంద్రహాస రెడ్డి, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారు మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ మొదలగు జబ్బులు శారీరక శ్రమ లేకపోవడం, ఆహార నియమాలు సరిగా పాటించకపోవడం వల్ల అసంక్రమణ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ శారీ రక శ్రమతో కూడిన సైకిల్ తొక్కడం, ఉదయం వాకింగ్, యోగా చేయడం వలన రక్తపోటు, మధుమేహం మొదలగు వ్యాధులు నయం చేయవచ్చని తెలియ జేశారు. కార్యక్రమంలో వైద్యులు జ్యోత్స్న, వినయ్, రాజేష్, సౌమ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి ఉపాధ్యాయులు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో పాటు వైద్య సిబ్బంది, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్ వైజర్, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు జనార్ధన్, శ్రీరాములయ్య, కాశీం, ఆశా కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ద్రావిడ సురేష్

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ద్రావిడ సురేష్ ఎన్నిక పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి జిల్లా సహాయ కార్యదర్శి ఇరుపోతు శ్రీనివాస్ వర్మ హర్షం వ్యక్తం చేశారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర 19వ మహాసభలు గుంటూరు జిల్లా తెనాలిలో ఈ నెల 11, 12 తేదీలలో నిర్వహించిన మహాసభలలో దేశంలో ఉన్న సాంఘీక, రాజకీయ, ఆర్థిక విపత్కర పరిస్థితులపైన చర్చించి దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఏవీ లేకుండా చేస్తూ ఆర్థిక, సహజ వనరులు అన్నీ కార్పోరేట్ చేతుల్లో పెడుతుందని, ప్రైవేటీకరణ ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. అనంతరం నాకు ఇచ్చిన బాధ్యతలను అభ్యుదయ రచయితల సంఘం ఆశయాలు లక్ష్యాల కోసం కృషి చేస్తానని తెలిపారు.

## జిల్లా విద్యాశాఖాధికారి ఆకస్మిక తనిఖీ

కేవిపల్లె, ఫిబ్రవరి 14 ప్రభాతవార్తః



మండలంలోని చిన్న కమ్మపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళ వారం ఉదయం డీఈఓ రాఘవరెడ్డి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు బైజూస్ ట్యాబుల వినియోగం గురించి పరిశీలించి ఆరా తీశారు. లిప్ కార్యక్రమం, తరగతుల అమలును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు తెలియజేశారు. వగళ్లలోని కేజీ బీవీ పాఠశాలను సందర్శించారు. తరగతులలో విద్యార్థులతో మాట్లాడారు. వారి ఆరోగ్య, భోజన, వసతి గురించి అడిగి తెలుసు కున్నా రు. స్పెషల్‌ఆఫీసర్, సిబ్బందితో సమావేశమై కేజీబీవీలో చేపడుతున్న రక్షణ చర్యలు పలు సూచనలను జారీచేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రెడ్డిబాషా, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రావణి, పాల్గొన్నారు.

## చిరుధాన్యాల సాగు , వినియోగం పెరగాలి

పీలేరు, ఫిబ్రవరి14 ప్రభాతవార్తః



అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా మంగళవారం పీలేరు మండలం వేపులబైలు గ్రామ పంచాయతీలో కలికిరి కేవీకేశాస్త్రవేత్తలు చిరు ధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పాండు రంగ మాట్లాడుతూ చిరుధాన్యాలలో ఉన్నటువంటి పోషకవిలువలు గురించి ఆహార ధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరించారు. జ్యోతి గహ విజ్ఞాన శాస్త్రవేత్త మాట్లాడుతూ వివిధ చిరుధాన్యాలైన కొర్రలు, రాగులు, సజ్జలలో విలువాధారిత ఉత్తర్వులు ఏవిధంగా తయారు చేసుకోవచ్చునని విపు లంగా వివరించారు. శాస్త్రవేత్త మాధురి మాట్లాడుతూ చిరుధాన్యాలు ఉత్పత్తిలో మన దేశం రెండోస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీని వాసులు, నవీన, గ్రామ వ్యవసాయ సహాయాధికారి మాధురి, జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

## ఆరోగ్య మేళా ర్యాలీ

దువ్వూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరులో మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థులతో కలిసి ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య మేళా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సమీరా మాట్లాడుతూ ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ కార్యక్రమం జరిగిందన్నారు. దువ్వూరు, పుల్లారెడ్డి పేట హైస్కూలు విద్యార్థులతో సైకిల్ ర్యాలలీ, యోగా సైకిలింగ్ చేయించారు. ప్రభుత్వం ప్రతి నెల 14న హెల్త్ మేళా చేయాలని ఆదేశించిందని తద్వారా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు సైకిల్ ర్యాలీ ద్వారా అంటురోగాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి సురేష్, పీఈటీలు శివారెడ్డి, ప్రతాప్, వైద్య సిబ్బంది శివరామయ్య, విజయకుమారి, మునిస్వామి, హారతి, పాల్గొన్నారు.

## రాయలసీమకే తలమానికం బీరంగి బండెన్న స్వామి ఆలయం

(మొదటి పేజీ తరువాయి)



ఈనాటి వరకు బక్తులు కోరిన కోర్కెలు తీర్చే ప్రసిద్ధిగాంచిన ఆలయంగా పెరుగాంచుతూ విరాజిల్లుచున్నది.అంతే కాకుండా ప్రతి సోమ, శుక్రవారంలలో రాయలసీమ, మరియు పక్క రాష్ట్రాల నలుమూలల నుంచి తండోపతండాలుగా భక్తులు వచ్చి పూజలు చేస్తుంటారు. అంతే కాకుండా అనారోగ్యంతో బాధపడుతూ వచ్చిన ఎంతో మంది భక్తులకు ఆ బండెన్న స్వామి అనుగ్రహంతో విముక్తి కలుగుచున్నది. మహాశివరాత్రి ఉత్సవ కార్యక్రమాలు ఎన్నో మహిమలు గల గూగుట్ట లో వెలసిన శ్రీ బండెన్న స్వామి ఆల యంలో మహాశివరాత్రి పర్వదినాన మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా బండెన్న స్వామి పీఠాధిపతి లక్ష్మిపతి భక్తుల కు అన్నదాన తీర్థప్రసాలు అందచేస్తారు. అంతే కాకుండా వేదపండితులతో మహాశివ రాత్రి పర్వదినాన చండీ హెూమము, నంది వాహనం ఊరేగింపు మంగలవాయిద్యాల మధ్య స్వామి వారిని మేల్కొల్పడం, రుద్రాభిషేకం, బిల్వార్చన, రాత్రి శివ లింగ పూజలు, మహాశివరాత్రి జాగరణ, కళశాల మెరవని, బ్రహ్మం గారి జీవిత చరిత్ర అత్యంతవైభవంగా నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలో ఎంతో విశేషం గా భక్తులు పాల్గొని వైభవంగా మహాశివరాత్రి జరుపుకుంటారు. అలాగే భక్తుల సాహకారంతో శివుని విగ్రహం75 అడుగుల విగ్రహ ప్రతిష్ఠ, 2 ఎకరాల విస్తీర్ణంలో గోశాల ప్రారంభించారు. అలాగే గూగుట్ట కొనలో 138 విగ్రహాలతో భక్తులకు పర్యాటకారంగంగాను నిత్యం కొలిచే ఆరాధ్య క్షేమంగా ను ఆకట్టుకుంటోంది. బండెన్న స్వామి ఆలయం భక్తులు నిత్యం కొలిచే దైవంగా తీర్చిదిద్దుతున్నాడు పీఠాధిపతి లక్ష్మిపతి స్వామి... భక్తులు కోర్కెలు తీర్చే ఆలయం పర్యాటక స్థలం గాను అభివృద్ధి చెందుతున్నది.

## మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

పీలేరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్తః



మహాశివరాత్రి సందర్భంగా పీలేరు నుంచి తలకోనకు 20 , భాకరాపేట నుంచి 4, బోడేవాండ్లపల్లె నుంచి-3 బస్సులు 18,19 తేదీలలో నడుపుతున్నట్లు డీఎం బండ్లకుమార్ తెలిపారు. బసన్నగారిపల్లె నుంచి 3 బస్సులు నడుపుతా మన్నారు. పీలేరు నుంచి కలకడ ఝరికి 18వ తేదీ ప్రత్యేక బస్సులు నడుప బడును పీలేరు పరిసర ప్రాంత ప్రజలు ఈసౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీసిద్దేశ్వరస్వామి కరుణ కటాక్షములు పొందగలరని డీఎం కోరారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

దువ్వూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



మండల పరిధిలోని మూడిండ్లపల్లె గ్రామంలో శ్రీమహాగణపతి, శ్రీసీతా రామలక్ష్మణ ధ్వజశిఖర విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు గ్రామస్థులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు మొదలు కాగా వివిధ రకాల పూజలు, అభిషేకాలు, ఉత్సవాలలో భాగంగా మంగళవారం మంగళ వాయిద్య వేద పఠనం, చండీ హోమం, మంగళహారతి, అంకురార్పణ, కుంకుమార్చన, హోమాలు, దీక్ష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇంకా రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలు బుధవారం యంత్రాభిషేకం, విగ్రహాలకు క్షీరాభిషేకం, గురువారం శ్రీసీతారామ కల్యాణం, విగ్రహ ప్రతిష్ట ఉంటుందని తెలిపారు. 15, 16 తేదీల్లో శ్రీసీతా రామలక్ష్మణ ఆంజనేయ వినాయక విగ్రహాల గ్రామోత్సవం, కాళికాంబ నృత్య వేషధారణ, 16న మండలం లోని భజన సంఘాలచే భజనలు, బండ లాగుడు పోటీలు నిర్వహిస్తామని తెలిఐపారు. 2 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు.

## ఘనంగా మక్కేషా ఉరుసు ఉత్సవాలు

దువ్వూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



దువ్వూరుకు సమీపంలోని పాత దువ్వూరులో వెలసిన శ్రీహజరత్ సయ్యద్ మక్కేషా వల్లీ ఉరుసు ఉత్సవాలు మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కానుకలు అంద జేశారు. సోమవారం గంధం, మంగళవారం ఉరుసు నిర్వహించారు.

## ప్లాస్టిక్ వాడకంతో మానవాళికి ముప్పు

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



ప్లాస్టిక్ పర్యావరణానికి హానికరమే కాదు. అత్యంత ప్రమాదకరమని మున్సి పల్ హెల్త్ ఆఫీసర్ ప్రశాంత్ వర్ధన్ పేర్కొన్నారు. పర్యావరణానికి, జంతు జీవా లకు, మానవాళికి ఎంతో ప్రమాదం పొంచి ఉందన్నారు. అందుకే 120 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వస్తువులపై జులై 7న నిషేధించారన్నారు. మంగళవారం కడప నగరపాలక సంస్థలో హెల్త్ ఆఫీసర్ ప్రశాంత్ వర్ధన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను వాడడం కారణంగా అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. రోగ నిరోధక శక్తి తగ్గుతుందన్నారు. క్యాన్సర్, మెదడు పనితీరుపై ప్రభావం పడడం, పిల్లల ఎదుగుదల సరిగా లేకపోవడం వంటి సమస్యలు వస్తాయన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని తెలిపారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## అటల్ పెన్షన్ యోజన అమలు తీరు ప్రశంసనీయం

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) పథకం అమలు పని ఇతర గ్రామీణ బ్యాంకుల కంటే ఏపీజీబీ ముందు వరుసలో ఉందని పీఎఫ్ఆర్డీఏ ఏజీఎం మోహిత్ యాదవ్ అన్నారు. మంగళవారం కడప నగరంలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో అటల్ పెన్షన్ యోజన అవుట్ రిచ్ సమావేశాన్ని నిర్వహించారు. ఏపీజీబీ ఛైర్మన్ రాకేష్ కశ్యప్ అధ్యక్షత వహించి మాట్లాడారు. అటల్ పెన్షన్ యోజన ప్రాముఖ్యతను వివరించారు. ఏజీఎం మోహిత్ యాదవ్ మాట్లాడుతూ ఏపీవై అమలు తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ దుర్గాప్రసాద్, ఎఫ్ఐజీఎం విజయభాస్కర్, రికవరీ జీఎం జగదీష్ రావు, చీఫ్ మేనేజర్ రసూల్, బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


## NOTIFICATION

- 1(a) కడప నగరపాలక సంస్థలో ODF++ లో భాగంగా ఇళ్లల్లో సెప్టెక్ ట్యాంకుల నుంచి ఉత్పత్తి అయ్యే ద్రవవ్యర్థములను నగరపాలక సంస్థ వారిచే అనుమతించబడిన వాహనములను మాత్రమే వినియోగించుకొనవలెనని కోరడమైనది.
- సదరు వాహన దారులకు తెలియజేయడమేమనగా నానేపల్లిలో వున్న SEWERAGE TREATMENT PLANT దగ్గర మాత్రమే వదిలిపోవలెను అని కోరడమైనది.
- కడప నగరపాలక సంస్థలో GFC (GARBAGE FREE CITY) 5 స్టార్ కార్యక్రమములో భాగంగా ప్రతి గృహస్తుడు తన ఇంట్లో ఉత్పత్తి అయ్యే ఘనవ్యర్థములను తడి పొడి మరియు హానికరమైన చెత్తలుగా విభజించి నగరపాలక సంస్థ వాహనమునకు ఇవ్వవలెను. తమ తమ ఇంట్లో ఉత్పత్తి అయ్యే వంటింటి వ్యర్థములు నుండి హోం కంపోస్ట్ తయారు చేసుకోనవలెను.
- కడప నగర పాలక సంస్థ పరిధిలోని నిర్మాణ మరియు కూల్చిన వ్యర్థములను నగర పాలక సంస్థ వారిచే అనుమతించిన వాహనమునకు మాత్రమే తగిన రుసుము చెల్లించి తరలించుకోనవలెను.

సూచన : వ్యర్థములను రోడ్లపై ఖాళీ స్థలాలపై మరియు కాలువలపై పారవేసినచో ఘన వ్యర్థ పదార్థముల నిర్వహణ రూల్స్ 2016 ప్రకారము అపరాధ రుసుము విధిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకొనబడును.

| | |
|---|---|
| **ఎస్. ప్రశాంత్ వర్ధన్** | **జి. సూర్య సాయి ప్రవీణ్‌చంద్,ఐఏఎస్.** |
| మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, | కమిషనర్ |
| కడప. | నగర పాలక సంస్థ, కడప. |

## పౌష్టికాహారంతోనే రక్తహీనత దూరం

కమలాపురం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్న గర్భవతులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనత దూరం అవుతుందని నీత్ అయోగ్ పరమల్ ఫౌండేషన్ పరిశీలకులు వెంకటేష్ అన్నారు. మంగళవారం కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కమలాపురం సెక్టారులోని కొలిమివీధి, గిడ్డంగి వీధుల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ క్రమంలో అంగన్ వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. గర్భవతులకు, బాలింతల నమోదులను, వైఎస్ఆర్ కిట్ పంపిణీ విధానాన్ని పరిశీలించారు. గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్ట బోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో జన్మిస్తారని అంగన్‌వాడీ పరిధిలోని గర్భ వతుల్లో బాలింతలలో రక్తహీనత దూరం కావాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సరఫరా అవుతున్న వాటిని తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సుజామణి, సూపర్ వైజర్లు జయకుమారి, పార్వతి, వైద్యసిబ్బంది జయకుమార్, ఏఎన్ఎం ధనలక్ష్మి, సీహెచ్‌వో శివ నాగమ్మ, ఆశా కార్యకర్తలు రాణి, శాంతి పాల్గొన్నారు.

## జాతరలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు : ఆర్డీవో

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



ఈనెల 20, 21, 22 తేదీల్లో జరగబోవు గంగమ్మ జాతరలో భక్తులకు ఏదైనా సమస్యలు కలగకుండా చూడాలని ఏమైనా ఇబ్బందులు పెడితే ఆ శాఖాధికారులపై చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఆర్డీవో రంగస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గంగమ్మ జాతరలోని కార్యనిర్వాహణాధికారి కార్యాలయం లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఒక్కొక్క శాఖాధికారితో మాట్లాడారు. విద్యుత్తు సమస్యలు రాకుండా చూడాలన్నారు. చాందిని బండ్లు పురవీధుల గుండా ఊరేగింపులో విద్యుత్తు తీగలు ఎక్కడ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గంగమ్మ జాతర ప్రాంతంలో నాటు సారాపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్, ఆలయ ఛైర్మన్ సామల నరసింహారెడ్డి, ఈవో రవీంద్ర రాజు, ఎంపీటీసీ సమరసింహారెడ్డి, సర్పంచ్ వెంకట నారాయణరెడ్డి, విద్యుత్తు శాఖ ఏఈ హరినాథ్, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, సీఐ వరప్రసాద్, ఎస్సై వినోద్ కుమార్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ నరసింహులు, వీఆర్వో పుష్పరాజ్, ఈవోపీఆర్డీ పట్నాక్, కడప, రాయచోటి, పులివెందుల డిపోల అధికారులు, ఆలయ కమిటీ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దామోదరం సంజీవయ్య గొప్ప దార్శనికుడు

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



ఉమ్మడి ఏపీ తొలి దళిత సీఎం దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు మాట్లాడుతూ దామో దరం సంజీవయ్య బడుగు, బలహీన వర్గాల ఉన్నతి కోసం ఎంతో కృషి చేశారని అతి చిన్న వయసులోనే సీఎంగా సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని ఆరు లక్షల ఎకరాల బంజరు భూమిని నిరుపేదలకు పంచారని, సమాజంలో ఆర్థికంగా వెనకబడిన కాపులను బీసీలుగా గుర్తించారన్నారు. ఆరోగ్య మంత్రి, వాణిజ్య మంత్రిగా, కార్మిక మంత్రి గా ఇలా ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి వన్నె తెచ్చారని కొనియాడారు. కార్య క్రమంలో బండి జకరయ్య, సత్తార్, మల్లెం విజయభాస్కర్, తిరుమలేష్, గొర్ల శ్రీనివాసులు, శ్యామలాదేవి, చెప్పలి పుల్లయ్య, ప్రసాద్‌గౌడ్, కనతల ప్రసాద్, లోకేశ్వరి, వెంకట లక్ష్మమ్మ, రత్నం పాల్గొన్నారు.

## సాధన ద్వారానే అభ్యసన మెరుగు : ఎంఈవో

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



మండలంవలోని కసాయి వీధిల, అమీన్‌రోడ్డు 11వ, 12వ పాఠశాలలను మంగళ వారం విద్యాశాఖాధికారి పాలెం నారాయణ సందర్శించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి సాధన అలవాటు చేసుకుంటే అభ్యసన మెరుగవుతుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తెలుగు ఉర్దూ ఆంగ్ల గణితం, సైన్స్ సాధన వర్కు బుక్‌లను నిశితంగా పరిశీలించి వారి తప్పులను సరిదిద్ది సంతకం చేయాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులతో ముఖాముఖి ద్వారా విలువైన సూచనల, సలహాలు, నాడు-నేడు పనులు మరియు 11వ వార్డు పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ ఆదిమూలం శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు మహ్మద్ దావూద్, అహ్మద్ బాషా, ఉమా చంద్రిక, రేణుక పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం సార్.. ట్రై స్కూటర్ ఇప్పించండి

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



ఎందరెందరికో ఎన్నో విధాలుగా ఆదుకుంటున్న డిప్యూటీ సీఎం సార్ ట్రై స్కూటర్ అందించి ఆదుకోవాలని అగాడి వీధికి చెందిన వికలాంగుడు సయ్యద్ జమీల్ అహ్మద్ కోరారు. ప్రస్తుతం తన వయసు 48 సంవత్సరాలని, 10వ తరగతి వరకు చదువుకొని జీవనం సాగిస్తు న్నారన్నారు. తనకు చిన్నప్పుడే పోలియో సోకి రెండు కాళ్లు పని చేయడం లేద న్నారు. తనకు పాత ట్రై సైకిల్ ఉందని వయసు మీద పడుతుండడంతో లాగ లేకున్నామన్నారు. నేను ట్రై స్కూటరుకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నామనీ, ట్రైస్కూటర్ అందించి ఆదుకోవాలని కోరారు.

## తైక్వాండోలో ప్రతిభ కనబరిచిన పీస్ స్కూల్ విద్యార్థులు

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



తిరుపతిలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో జరిగిన ఓపెన్ సౌత్ జోన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2023లో పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పాల్గొని 4 గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్ సాధిం చారు. షేక్ నూర్ బాషా, షేక్ ఇబ్రహీం, షేక్ మహ్మద్ రిహాన్, మహ్మద్ అలీఖాన్ గోల్డ్ మెడల్స్ సాధించారు. షేక్ ఫర్మాన్, షేక్ ఖాజా మొహిద్దీన్, సయ్యద్ మహ్మద్ ఫర్మాన్‌లు సిల్వర్ మెడల్స్ సాధించడంతో విద్యార్థులను కరాటే మాస్టర్ మన్సూర్, పీస్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్‌పీర్‌లు అభినందించారు.

## సమస్యలు తెలుసుకున్న వైస్ ఛైర్మన్ బంగారురెడ్డి

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



మున్సిపల్ పరిధిలోని 22 వార్డులో స్థానిక వైఎస్ఆర్సిపి ఇన్చార్జి ఇదాయత్, వార్డు ప్రజలు ఎన్నో ఏళ్లుగా కాలువకు సంబంధించిన కల్వర్టు సమస్య ఉందని, మురికి నీరు బయటకు వచ్చి దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించిన మున్సిపల్ వైస్ ఛైర్మన్ నేరుగా వెళ్లి పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేయాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వైస్ ఛైర్మన్ బంగారు రెడ్డి అని వార్డు ప్రజలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఇదాయత్, 11 వ వార్డు ఇన్చార్జి కసిరెడ్డి మహేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ వడ్ల దాదాపీర్, స్థానిక నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## భూమి పూజ కాదు పరిశ్రమ కావాలి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



భూమి పూజతోనే చేతులు దులుపుకోకుండా చిత్తశుద్ధితో ఉక్కు పరిశ్రమను పూర్తి చేయాలని ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడప నగరంలోని ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమను శంకుస్థాపనలు భూమి పూజలతోనే సరిపెట్టి కడప జిల్లా ప్రజానీయం ఉక్కు పరిశ్రమ ఆశలను నెరవేర్చకుండా నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమ అంటే మూడు పూలు ఆరు కాయలు అనే సామెతగా మూడు శంకు స్థాపనలు ఆరు భూమి పూజలు లాగా మారిందని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా మన జిల్లా వాసి సీఎం జగన్ భూమి పూజకే పరిమితం కాకుండా చిత్తశుద్ధితో పూర్తి చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని ఆయన వాపోయారు. ఉక్కు పరిశ్రమను పూర్తి చేస్తే జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రత్యక్షంగా 12 వేలు, పరోక్షంగా లక్షకు పైగా ఉద్యోగాల ద్వారా ఉపాధి దొరుకుతుందన్నారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శులు శివ, నగర సహాయ కార్యదర్శి వినయ్, నగర ఉపాధ్యక్షుడు అజయ్, కార్తీక్, నాయకులు మధు, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

## బడిబాట ద్వారానే బాలికలకు బంగారు బాట

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:

మన బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా బడి బయట పిల్లల్ని బడిలో చేర్పించడం కోసం నగరంలోని నాగరాజుపేట ప్రాంతంలో పర్యటించి ఇద్దరు బడి బయట పిల్లలను గుర్తించి వారిని సీఎస్ఐ హైస్కూలు నందు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సుదేవి సమక్షంలో వారి వయసుకు అనుగునంగా తరగతిలో కడప మండల సీఆర్పీలు చేర్పించారు. సీఆర్పీలు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి పేద పిల్లవాడి ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యార్తులకు అందజేస్తున్న పాఠ్యపుస్తకాల నుంచి విద్యాలయాల్లో అన్ని రకాల మౌలిక వసతులను ఏర్పాటు చేస్తూ బడి బయట పిల్లలు ఉండకూడదనే లక్ష్యంతోనే దేశంలోనే ఎక్కడా లేని విధంగా అమ్మఒడి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.15వేలు అందజేయడం ఎంతో ప్రతిష్టాత్మకమన్నారు. కార్యక్రమంలో సీఆంర్పీలు ఆదిమూలం శంకర్, కృష్ణ, నాగమణి, కుమారి, జమీలున్నీసా, ఫర్జానా బేగం, హాజీరా భాను, సువర్ణ, మంగమ్మ, వెంకటాద్రి, రామచంద్ర, రామ్మోహన్ పాల్గొన్నారు.

## రక్తదాతకు సత్కారం

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



స్వర్గీయ ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా కడప నగరానికి చెందిన ఎన్టీ రామారావు అభిమాని రక్తదాత లక్ష్మి పాలకొండ్రాయ స్వామి వారి దేవస్థానం మాజీ ఛైర్మన్ భోగింరెడ్డి బాలఓబుల్‌రెడ్డిని జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ జి.లక్ష్మిరెడ్డి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఆర్‌కే సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రక్తదానం ఒకరికి ప్రాణ దానమని ఇలాంటి రక్తదాతలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఆయన అన్నారు. ప్రతి సంవత్సరం ఎన్టీ రామారావు జయంతి (మహానాడులలో) వర్ధంతిల సందర్భంగా ఏర్పాటు చేసే రక్తదాన శిబిరాలలో భోగిరెడ్డి బాల ఓబుల్‌రెడ్డి 49 సార్లు రక్తదానం చేయడం అభినంద నీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకుడు మాజీ సింగిల్ విండో అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, తెదేపా యువత జిల్లా నాయకులు రఘునాథ రెడ్డి, సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, సాదక్, హుసేన్, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

## హత్య కేసులో సూత్రధారులను వైసీపీ ప్రభుత్వం కాపాడుతోంది

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



కడప నగరంలోని జిల్లా తెదేపా కార్యాలయంలో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్.అమీర్‌బాబు చేతుల మీదుగా జగనాసుర రక్తచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించి అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర సీఎం జగన్ సొంత బాబాయి మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే వై.ఎస్.వివేకానందరెడ్డిని అతి క్రూరంగా హత్య చేస్తే ఇంత వరకు ఆ హత్యకు సూత్రదారులైన వారు ఎంత పెద్ద స్థాయిలో ఉన్నా ప్రజలందరికీ తెలిసేలా జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అలాంటి వారిని ప్రజా కోర్టులో నిందితులుగా నిలబెట్టాలని ఈ వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అమీర్ బాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెదేపా నగర ప్రధాన కార్యదర్శి జల తోటి జయకుమార్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సీఎస్ నాసర్ అలీ, పార్లమెంటు తెదేపా యువత కార్యదర్శి ఎస్.రెహమాన్, తెలుగుదేశం పార్టీ నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు షేక్ ఇమ్రాన్, పార్లమెంట్ బీసీ సెల్ నాయకుడు బుర్రి రెడ్డయ్య యాదవ్ పాల్గొన్నారు.

## మహా శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు

కమలాపురం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



పట్టణంలోని శ్రీశ్రీ పాతాళ సోమేశ్వర స్వామి ఆలయం, మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామంలో వెలసిన శ్రీపార్వతీ సమేత అగస్త్యేశ్వ రాలయం, పెద్దచెప్పలిలో వెలసి ఉన్న అగస్త్యేశ్వరా లయం, రామాపురం పుణ్య క్షేత్రాలలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు అర్చకులు తెలిపారు. మహాశివరాత్రిని పురస్క రించుకొని ముద్రించిన కరపత్రాలు ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. అర్చకులు మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా ఈ నెల 18న సూర్యోదయ యాత్పూర్వం నాలుగు గంటల నుంచే అభిషేకాలు ఉదయం 10గంటలకు శివ పార్వతుల కల్యాణం, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయాన మహా శివునికి రుద్రాభిషేకాలు, వచ్చిన భక్తులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్న దానం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## జ్ఞానాంభిక విద్యార్థులకు స్పోర్ట్స్ స్కాలరిష్

మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



పట్టణంలోని జ్ఞానాంభిక డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ఎస్వీ యూనివర్శిటి స్పోర్ట్ స్కాలర్‌సిప్ అందజేసింది. కళాశాలకు చెందిన బాబా పక్రుద్దిన్ తైక్వాండో క్రీడల్లో గతనెలలో అమృత్‌సర్ గురునానక్ యూనివర్శిటిలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. మరో విద్యార్థి ఫారుక్ చత్తీష్‌గడ్‌లో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొన్నాడు. దీంతో ఎస్‌వి యూనివర్శిటి జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న ఇద్దరు విద్యార్థులకు రూ.5వేలు చొప్పున స్పోర్ట్ స్కాలర్‌షిప్ అందజేసినట్లు కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. గెలుపొందిన వీరిని కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ రమాదేవి, విద్యార్థులు అభినందించారు.

## మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

రామసముద్రం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :



రామసముద్రం మండల వైసిపి ముఖ్య నాయకులు మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిని మంగళవారం కలిశారు. మండల వైసిపి కన్వీనర్ భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రిని కలసి మండల అభివృద్ధి గురించి వినతిపత్రం సమర్పిం చారు. దీనికి మంత్రి స్పందించి మండల అభివృద్ధికి అన్ని విధాల ఆదుకొంటానని మండల నాయకులకు తెలిపారు. మంత్రిని కలిసిన వైసిపి నాయకులు వైస్ ఎంపిపి రమణారెడ్డి, ఉదయ్, ఇతర వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్యలో ఆరోగ్యమేళా వారోత్సవాలు

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



పొద్దుటూరు పట్టణంలోని స్థానిక సాయి రాజేశ్వరి కాలనీలో వుండే శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆరోగ్యమేళా వారోత్సవాలను ప్రారంభించినట్లు ప్రధానోపాధ్యా యుడు వెంకట సుబ్బయ్య తెలిపారు. పాఠశాల ఎజియమ్ నాగిరెడ్డి మాట్లాడుతూ సైకింగ్ చేయడం వల్ల మధుమేహం, రక్తపోటు లాంటి జబ్బుల నుంచి నివారించుకోవచ్చన్నారు. ఆయుస్మాన్ భారత్లో భాగంగా సైక్లింగ్ చేద్దాం క్యాన్సరీని నివారిద్దాం సైక్లింగ్ చేద్దాం గుండె జబ్బు లను నివారిద్దాం. సైక్లింగ్ చేద్దాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే స్లోగన్లలో విద్యార్థుల సైకిల్ ర్యాలీ రాజేశ్వరి కాలనీలో నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది కొత్తపల్లె2 సచివాలయ వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మౌనిక, ఎ.యన్.యమ్ శ్యామల ఆషా వర్కర్లు పద్మావతి కమలమ్మలు పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వీణాకుమారి, ప్రైమరీ ఇంచార్జ్ రాజావి వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహనా ర్యాలీ

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



"ఆరోగ్యానికి భరోసా-ప్రగతికి హామి" అంటూ ఆయుష్మాన్ భారత్-ఆరోగ్య మేళా వారోత్సవాల లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆరోగ్య కార్యక్రమాల పై అవగాహన కల్పించుట జరుగుతున్న సందర్భంగా ఈ రోజున సైక్లింగ్ చేద్దాం-ఉల్లాసంగా ఉందాం. సైక్లింగ్ చేద్దాం - క్యాన్సర్ ను ఓడిద్దాం ,వ్యాయామం చేద్దాం-గుండె జబ్బులను నివారిద్దాం యోగా చేద్దాం మనసుకు ప్రశాంతత నిద్దాం అంటూ స్లోగన్ చేసుకుంటూ ర్యాలీ చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా సైకిల్ తొక్కడం ,వ్యాయామం యోగ ఆరోగ్యానికి మంచి ది అని ప్రొద్దుటూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉపేంద్ర కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.హనీఫ్ బాబ గోపవరం రెండవ సచివాలయ పరిధి లో జరిగిన ర్యాలీ లో సంయుక్తంగా పేర్కొన్నారు.ఈ రోజు మండలం లోని అన్ని హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్ల లలో సైకిల్ ర్యాలీలు, వ్యాయామం, యోగ పైన,అవగాహన కల్పించుట జరిగింది.ఈ కార్యక్రమంలో డా.శ్రీనివాసులు,సీహెచ్ఓ క్రిష్ణమ్మ హెచ్ఈ శోభారాణి,సూపర్ వైజర్ వర ప్రసాద్, చంద్ర కళ సీహెచ్ఓలు ఆరోగ్య కార్యకర్తలు ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎఐఎస్ఎఫ్ 19వ జిల్లా మహాసభలు

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణంలోని పెన్నా నగర్ ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో 19వ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించారు అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా నూతన కమిటీని వెల్లడించారు ఏఐఎస్ఎఫ్ కడప జిల్లా అధ్యక్షులుగా పవన్ కుమార్ ఉపాధ్యక్షులుగా ఆమోస్ లక్ష్మణ్ సతీష్ ప్రధాన కార్యదర్శిగా జి వలరాజు సహాయ కార్యదర్శిగా అశోక్ శరత్ మురళి కోశాధికారిగా లీలా కృష్ణలు ఎన్నికయ్యారన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న విద్యా రంగాన్ని సమూల మార్పులు తీసుకొస్తున్నామని చెప్పి రాజకీయ రంగం రుద్దు కుంటూ ఆంచల్ విధించే విధంగా ప్రభుత్వాల పనితీరు ఉందని తెలిపారు దుర్మార్గపు ఆలోచనలతో విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో నెట్టు వేసే జీవో 117 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో జిల్లా కార్య దర్శి జి వలరాజు అధ్యక్షులు పవన్ జిల్లా సహాయ కార్యదర్శి అశోక్ శరత్ కోశాధికారి లీలా తేజ పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ జట్టుకు రోజా ఎంపిక

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



కేరళలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ నందు ఫిబ్రవరి 15 నుండి 19 వరకు జరిగే పోటీలలో జేఎన్టీయూ ఏ సౌత్ జోన్ జట్టులో ప్రొద్దుటూరు మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం అభ్యసి స్తున్న బి రోజా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వి రామరాజు తెలిపారు అలాగే జేఎన్టీయూ ఏ సౌత్ జోన్ కబాడీ గట్టు లో కూడా ఆమె ప్రతిభ కనబరిచి ఎంపికైం దన్నారు. విద్యార్థిని బి రోజా సాధించినటువంటి ప్రతిభకు కళాశాల ప్రిన్సిపల్ వి రామరాజు కళాశాల కరస్పాండెంట్ సి బాబమ్మ కళాశాల డైరెక్టర్లు సి నాగూర్ బి రవీంద్రారెడ్డి కో డైరెక్టర్ శైలూష అక్కడ మీకు అడ్వైజర్ ఉమాకాంతం ఫిజికల్ డైరెక్టర్ జి తివారి ఆర్ విజయలక్ష్మి డి విజయమ్మ మరియు అధ్యాపకులు అధ్యా పకేతర సిబ్బంది అభినందించారు.

## సిఎం జిల్లా పర్యటనను అడ్డుకుంటాం

### నల్లబోతుల నాగరాజు, జియా ఉద్దీన్

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



రాష్ట్ర యువతకు మోసపూరితమైన వాగ్దానాలు చేసి అధికారం చేపట్టిన మొదటి సంవత్సరమే కడప ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసి ఇంతవరకు ఎలాం టి నిర్మాణాలు చేపట్టకపోగా మరోసారి భూమి పూజ అంటూ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డిని ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో అడ్డుకుంటామని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు హెచ్చరించారు ఈ సందర్భంగా మంగళవారం ఆయన పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర ప్రజలకు మోసపూరిత వాగ్దానాలతో అధికారం చేపట్టి మూడు సంవత్సరాల మూడు నెలల నెలలైనా ఒరగబెట్టిందేమీ లేదన్నారు. సీఎం సొంత జిల్లా వాసి కావ డంతో జగన్ మాయ మాటలు నమ్మి జిల్లాలో ప్రజలు 10కి 10 అసెంబ్లీ స్థానాలను కట్టబెట్టారన్నారు. జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలంటే కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించడం తప్పనిసరి అన్నారు అధికారం చేపట్టిన అనంతరం శిలా ఫలకం వేసి అధికారం కోల్పోయే ముందు మరోసారి భూమి పూజ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు పర్యటిస్తున్న సీఎం జగన్ జిల్లా పర్యటనను అడ్డుకుంటామని తెలిపారు.

## నూతన బైక్ హీరో జూమ్ లాంచింగ్ చేసిన డిప్యూటీ సీఎం

కడప వైద్యవిధానం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త




కడప నగర శివారులోని కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా హీరో జూమ్ 110 సిసి నూతన బైక్ లాంచింగ్. వావ్ హీరో అల్మాస్ పేట బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో బైక్ లాంచ్ చేసిన ఏపీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కాలేజీల చైర్మన్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ప్రముఖ డెంటల్ డాక్టర్ తిరుమల రావు,ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల కేరింతల మధ్య మంగళవారం బైక్ లాంచింగ్ చేయడం జరిగిందన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం అంజాద్ భాష మాట్లాడుతూ నూతన హంగులతో విడుదల చేసిన హీరో జూమ్ 110 సిసి బైక్ ను యువత ఇలాంటి నూతన టెక్నాలజీ బైక్ కొనుగోలు చేసి ఉత్సాహంగా సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. అనంతరం నూతన హీరో జూమ్ 110 సిసి బైక్ ను టెస్ట్ రైడ్ చేసి విద్యార్థిని, విద్యార్థుల తో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కే ఎస్ ఆర్ ఎమ్ ప్రిన్సిపాల్ వి ఎస్ ఎస్ మూర్తి ఫిజికల్ డైరెక్టర్ వంశీ నాయక్ వావ్ హీరో జనరల్ మేనేజర్ ఫ్రాన్సిస్, వావ్ హీరో సిబ్బంది.

## నేడు కొండపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

చెన్నూరు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

కొండపేట నందు బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పెడబల్లె సుధాకర్ రెడ్డి తెలిపారు, బుధవారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ కీర్తిశేషులు పెడబల్లి సుబ్బారెడ్డి(కొండపేట రెడ్డి) కీర్తిశేషులు పెడబల్లె శివారెడ్డి(మాజీ సర్పంచ్) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రిక వారిచే కొండపేట నందు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియ జేశారు, కార్య క్రమంలో డాక్టర్ పి అమర్నాథరెడ్డి ,డాక్టర్ జిగీష, డాక్టర్ శ్రావణి నేతృత్వంలో ప్రత్యేక కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహించి, అవసరమైన వారికి పుష్పగిరి కంటి ఆసుపత్రి నందు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించబడతాయని ఆయన తెలియ జేశారు, ప్రత్యేకంగా శుక్లము లకు ఆధునిక ఆపరేషన్, మెల్లకన్ను వారికి ఆపరేషన్, రెటీనా ఆపరేషన్, కార్నియా ఆపరేషన్, గ్లాకోమా( నీటి కాసులు) ఆపరేషన్లు, కంటి ప్లాస్టిక్ సర్జరీ, చిన్నపిల్లల కంటి చికిత్స ఆపరేషన్లు, కంటి శుక్లాలు గుర్తించి వారికి కంటి( కుట్లు లేని) ఆపరేషన్ నిర్వహించబడునని, కాంటాక్ట్ లెన్స్, వంటి మొదలగు శస్త్ర చికిత్సలు, నిర్వహించ బడతాయని ఆయన తెలియజేశారు, ఆపరేషన్లు చేయించుకుని వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తప్పక తీసుకు రావాలని ఆయన తెలియజేశారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

చాపాడు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

స్థానిక మండల పరిషత్ సభా భవనం నందు గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు మండల పరిషత్ అధ్యక్షులు .టి. లక్ష్మయ్య ,అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు, ఎంపీడీవో. శ్రీధర్ నాయుడు తెలిపారు. ఈ సమావేశానికి శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వివిధ శాఖల మండల స్థాయి అధికారులు వారి శాఖల యొక్క సమగ్ర నివేదికతో హాజరుకావాలని కోరారు.

## టిడిపి కార్యకర్త నాగన్నను పరామర్శించిన మండిపల్లి

రామాపురం.ఫిబ్రవరి14 ప్రభాతవార్త



మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బి.రాచపల్లికు చెందిన టిడిపి కార్యకర్త మేర నాగన్న అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న రాయచోటి టిడిపి నియోజకవర్గ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం ఆయన స్వగృహాలనికి వెళ్లి పరామర్శించారు. మేరా నాగన్న త్వరగా కోలుకోవాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. నాగన్నకు అన్ని విధాల తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈయన వెంట టిడిపి నాయకులు అల్లాబకస్, రమణయాదవ్ తదితరులు ఉన్నారు.

## పూల్వామా బాధితులకు కొవ్వొత్తులతో నివాళి

చిట్వేలి, ఫిబ్రవరి 14

ప్రభాతవార్త



సరిగ్గా నాలుగేళ్ల క్రితం 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కాశ్మీర్‌లో 40 మంది భారతీయ జవాన్ల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల ఉన్మాద చర్య 'బ్లాక్‌డే'ను మంగళవారం దేశవ్యాప్తంగానే కాక పల్లె పల్లెనా అట్టి అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఇందులో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఎన్‌సిసి అధికారి పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులు పాఠశాల నుంచి ప్రధాన వీధిలో పోలీసుస్టేషన్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పసుపుల రాజశేఖర్, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్‌లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ చర్యకు వ్యతిరేకంగా ఆనాడు ప్రజలు సైనికులకు అండగా నిలిచారని తదుపరి భారత సైనికులు ప్రతీకారం తీర్చుకున్నారని అన్నారు. మంచుకొండల్లో విధులు నిర్వహిస్తూ వారి ప్రాణాలను త్యాగం చేస్తూ మన అందరిని రక్షిస్తున్న జవాన్లకు ఏమిచ్చినా తక్కువేనని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు డేవిడ్‌ప్రసాద్, కొనిశెట్టి సుబ్బరాయుడు, కంచర్ల సుధీర్‌రెడ్డి, పసల దినేష్, శివ, పగడాల గణేష్, రహీమ్, కృష్ణపవన్‌రాజ్, నాని, మహేష్, మమ్ము పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కడప నగరంలో రోడ్ల విస్తరణ పనులు

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:

కడప నగరంలో రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నట్లు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ జి.చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం కడప నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో చంద్రమోహన్ మాట్లాడుతూ దేవుని కడప 80 అడుగుల రోడ్డు విస్తరణ, ఎన్‌క్రోజ్‌మెంట్‌లో భాగంగా సుమారు 20 ఏళ్ళ, అలాగే మాసాపేట 80 అడుగుల రోడ్డు విస్తరణలో సుమారు 60 ఇళ్లు తొలగిపోతున్నట్లు చెప్పారు. మిగిలిన వారికి ల్యాండ్ అక్విజేషన్ కింద అవార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. ట్రాన్స్ వర్చువల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) అంగీకరించిన వారికి ప్రాసెసింగ్‌లో ఉందన్నారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



ఎపిటిఎఫ్ రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించా లని కోరుతూ ప్రొద్దుటూరు తహసిల్దార్ నజీర్ అహమ్మద్ కి ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏపిటిఎఫ్ రాష్ట్ర సంఘం చేపడుతున్న దశల వారి ఆందోళనలో భాగంగా ఈ నెల 14 నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలోని తహసిల్దార్లకు వినతిపత్రాలను సమర్పించే కార్యక్రమంలో భాగంగా పొద్దుటూరు తహ సిల్దార్ కి వినతిపత్రం సమర్పించామన్నారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని,12వ పిఆర్సీని నియమించాలని, పెండింగ్లో ఉన్న మూడు విడతల డిఎలను ప్రకటించాలని, 2018 నుంచి ఉద్యోగులు, పెన్ష నర్లకు చెల్లిం చాల్సిన, కరువుబత్యం బకాయిలను వెంటనే చెల్లించాలని ,పిఎఫ్ , ఎపిజియల్ఐ ,జిఐఎస్ రుణాలను, చివరి మొత్తాలను వెంటనే చెల్లించాలని,11వ పిఆర్సి లోని అసంఘతాలను సవరించాలని, ప్రతినెల 1వ తేదినే వేతనాలు, పెన్షన్లను చెల్లించాలి. సమస్యలను పరిష్కరించకపోతే తాలుకా, జిల్లా,రాష్ట్రవ్యాప్త ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రఆడిట్ కమిటి సభ్యుడు క్రిష్ణారెడ్డి, ప్రొద్దుటూరు మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్సులు సయ్యద్ భాష,చంద్రశేఖర్, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కమలాపురం విద్యార్థులకు బంగారు పతకం

కమలాపురం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన టెంపుల్ ఆఫ్ తైక్వాండో భారత్ సౌత్ మీట్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంటులో కమలాపురం పట్టణానికి చెందిన ఆశీర్వాద్, షామిద్, షేక్ అహిల్‌లు గోల్డ్ మెడల్, షేక్ అయాన్, నాగరాజులు సిల్వర్ మెడల్‌లు సాధించగా నవీన్ బ్రాంజ్ మెడల్ సాధించారని తైక్వాండో కోచ్ సుమన్ విజేతలను అభినందించగా పలువురు ప్రశంసించారు.

## 16న కోట గంగమ్మ తల్లి 16వ వార్షికోత్సవం

కమలాపురం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణం పడమటివీధి, బస్టాండు బోరంతలో వెలసిన కోట గంగమ్మ తల్లి వార్షికోత్సవం 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలందరూ ఆహ్వానితులే అని ప్రత్యేకంగా అమ్మకు ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, తీర్థ ప్రసాదాలు, మధ్యాహ్నం అన్నదానం స్వీకరించి కోట గంగమ్మ ఆశీస్సులు పొంది కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు.

## సామాజిక తనిఖీలో రూ.11500 రికవరీ

చిన్నమండెం.ఫిబ్రవరి14



ప్రభాతవార్త

చిన్నమండెం మండలంలోని స్త్రీశక్తి భవనంలోని సభాభవనం నందు 17వ రౌండు ఉపాధి హామీ పథకంలో సోషియల్ ఆడిట్ ఫిబ్రవరి 1 నుంచి 31 వరకు తనిఖీ చేయడం జరగింది. ఇజిఎస్, పిఆర్, ఎస్ఎస్ఎ, ఆర్డబ్ల్యుఎస్, ఫారెస్ట్ అన్ని డిపార్టమెంట్‌లు కలిసి 11,34,03,988 రూపాయలు ఆడిట్ చేశారు. ఈ ఆడిట్ నందు 220000 రూపాయులు ముఖ్యంగా పని ప్రదేశంలో నేమ్ బోర్డ్స్ లేవు అని అదే విధంగా ప్లాంటేషన్ వర్కర్లుకు మొక్కలు చనిపోయినాయని చెప్పారు. 13 గ్రామ పంచాయతీలకు గాను 11500 రూపాయలు రికవరీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి ఎ.మద్దిలేటి, ఏపిడి రవికుమార్, ఎంపిడివో దివ్య, ఎస్ఆర్‌పి తిరుమలేష్, ఏపివో జెఇ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ ఫోర్‌వేకి కోల్పోయిన ఆస్తులకు నష్ట పరిహారం చెల్లించాలి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 14,



ప్రభాతవార్త:

కడప – రేణిగుంట ప్రధాన రహదారి 4 లైన్లకు సంబంధించి ఓబు లవారిపల్లె మండలం జెడ్‌హెచ్‌సీ 2వ కాలనీ నుంచి వెళ్తోంది. అయితే భూములను గుర్తించి నష్టపరిహారం రాశారే తప్ప ఆ భూమిలో ఉన్న బోర్లు, మామిడి చెట్లు, వేపచెట్లు, చింతచెట్లు తదితర వాటికి సంబంధిత అధికారులు గుర్తించి జిల్లా అధికారులకు నివేదికలు పంపకుండా భూములకు మాత్రమే నగదు వచ్చేలా అధికారులు నివేదికలు పంపారని అదే గ్రామానికి చెందిన భూ బాధితులు వెంకటేశ్వర్లు ప్రభాతవార్తకు తెలిపారు. ఈ విషయమై ఓబులవారిపల్లె తహసీల్దార్ పీర్‌మున్నీకి వినతిపత్రం అందజేశామన్నారు. ఆమె సానుకూలంగా స్పందించి భూములతో పాటు పంట నష్టపరిహారం, చెట్లు, బోరు బావులకు కూడా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. కొంత మంది అధికారులు పర్యవేక్షణ లోపం వెరసి చెట్లను రాయకుండా రైతులను నష్టపరుస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పర్యవేక్షించాల్సిన అధికారులు చెట్లను, బోరు బావులను గుర్తించి పేపర్ వర్క్ నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు.

## హార్సిలీ హిల్స్‌లో పోలీస్ ఔట్‌పోస్టు ప్రారంభం

బి. కొత్తకోట ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



పర్యాటకుల సౌకర్యార్థమే టూరిస్ట్ పోలీస్ ఔట్ పోస్ట్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానం ద్వారా ప్రముఖ పర్యట కేంద్రమైన హార్సిలీ హిల్స్ లో ఏర్పాటు చేసిన ఏపీ టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభించారు. రాష్ట్రంలో 20 పర్యాటక కేంద్రాల్లో టూరిస్ట్ పోలీస్ కేంద్రాలను ప్రారంభించారు. అవసరమైన సమాచారాన్ని అందించడం, సమస్య వస్తే పర్యాటకులకు అందుబాటులో ఉండడమే ప్రధాన లక్ష్యంగా పోలీస్ కేంద్రా లను ప్రారంభించారు. సీఎం పోలీస్ కేంద్రాలను క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. అన్నమయ్య జిల్లాలోని హార్సిలీ హిల్స్‌లో పోలీస్ హౌస్ ఔట్ పోస్టును జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పర్యాటకులకు ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా సహకారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మదనపల్లి ఇంచార్జ్ డిఎస్పి శ్రీనివాసరావు, మదనపల్లి రూరల్ సిఐ శివాంజ నేయులు, బి. కొత్తకోట యస్ఐ రామ్మోహన్, ముదివేడు ఎస్ఐ సుకుమార్, పోలీసులు పాల్గొన్నారు.

## విగ్రహాలకు ముసుగులు

చిన్నమండెం.ఫిబ్రవరి14 ప్రభాతవార్త



ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా ఎన్నికల అధికారులు ఆదేశాల మేరకు మండలంలోని నాయకులు విగ్రహాలకు ముసుగులు తొడగారు. ఈ సందర్భంగా ఎంపిడివో దివ్య ఆద్వర్యంలో మండలంలోని చిన్నమండెం బస్టాండ్, మల్లూరు క్రాస్‌రోడ్, చాకిబండ, వండాడి తదితర గ్రామాలలో ఉన్న నాయకులు విగ్రహాలకు మంగళవారం ముసుగులు తొడగారు. వీటిని కోడ్ ఉన్నంత వరకు ఎవరూ తొలగించరాదన్నారు. అలా తొలగించిన ఎడల వారిపై చర్యలు తీసుకోబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

## జనం లేక లోకేష్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్

సిద్దవటం, ఫిబ్రవరి 14,



ప్రభాతవార్త:

నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర జనం లేక అట్టర్ ఫ్లాప్ అయిందని వైసీపీ కడప జిల్లా అధ్యక్షుడు మేయర్ సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మాధవరం-1 గ్రామంలో మంగళవారం వైఎస్ఆర్ రైతు విభాగం మండల కన్వీనర్ పల్లె సుబ్బరామిరెడ్డి గృహ ప్రవేశం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సుమారు 1.38లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించడంతో పాటు 4 లక్షల మందికి గ్రామ వాలంటీర్లుగా నియమించి పార్టీలకతీతంగా కుల మత ప్రాంత బేధాలు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలనూ డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేయడం జరుగుతోందన్నారు. నువ్వే రావాలి, నువ్వే కావాలి జగన్ అన్న నినాదంతో అధికారంలోకి వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. వైఎస్ఆర్‌సీపీ గృహ సారథులు కేటాయించిన కుటుంబాలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకొని వెళ్లి వచ్చే ఎన్నికల్లో 175 సీట్లతో వైసీపీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలన్నారు.

**కడప అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా అంజాద్‌బాషా**

వైఎస్ఆర్‌సీపీ కడప అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా వచ్చే ఎన్నికల్లో ఎవరు పోటీ చేస్తారని విలేకరులు అడగగా కడప ఎమ్మెల్యే అభ్యర్థిగా అంజాద్‌బాషా పోటీ చేసి మరో సారి ఎమ్మెల్యేగా గెలుస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు కేవీ సుబ్బయ్య, ఎల్లారెడ్డి, ఇరగంరెడ్డి సర్రా రెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేసవిలో సమస్యలు లేకుండా చూడండి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లెలోని 22 పంచాయతీల్లో వేసవి సమీపిసస్తుండడంతో సంబంధిత సర్పంచులు సమస్యలు లేకుండా చూడాలని ఎండీవో విజయారావు సూచించారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కార మార్గాలు చూపేందుకు చొరవ చూపాలని ఆయన తెలిపారు.

## ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి : ఒంటేరు

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఒంటేరు శ్రీనివాసులరెడ్డి డిమాండు చేశారు. ప్రొద్దుటూరులోని చైతన్య, ఆదిత్య, అరవింద్ గౌతం ప్రైవేటు పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శిం చారు. ఈ సందర్భంగా ప్రైవేటు అధ్యాపకుల సమస్యల గురించి చర్చించి వాటి పరిష్కా-రానికై కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా డీఎస్సీలు నిర్వహించకపోవడంతో ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు పూర్తి చేసుకున్న వేలాది నిరుద్యోగులు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్నారని చెప్పారు. కార్య క్రమంలో ప్రముఖ వైద్యులు వరుణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ కూరపాటి శ్రీనివాసులు రెడ్డి, విశ్రాంత వ్యాయామోపాధ్యాయులు కోటా ఓబుల రెడ్డి, రామసుధాకర్ రెడ్డి, షేక్షావలి, కేపీ ఓబుల రెడ్డి, మురళి పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవు

**తహశిల్దారు మురళీకృష్ణ**

చిట్వేలి, ఫిబ్రవరి 14



ప్రభాతవార్త

చిట్వేలి మండల పరిధిలో ప్రభుత్వ సంబంధిత భూములను ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని తహశిల్దారు మురళీకృష్ణ పేర్కొన్నారు. ఇందులో భాగంగా మంగళవారం మండల పరిధిలోని రాజుకుంట వివాదాస్పద, ఆక్రమిత రెవెన్యూ భూముల్లో పర్యటించారు. వివాదాస్పద స్థలంలో హెచ్చరికలు జారీ చేస్తూ ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేయించి హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతటివారైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజుకుంట పంచాయతి పరిధిలోని అటవీ ప్రాంతం సమీపంలో ఆక్రమించి చదును చేసి కంచె ఏర్పాటు చేసుకున్న భూములను తహశిల్దారు పరిశీలించి కంచెను తొలగించారు. ప్రసాద్, ఆదినారాయణ అనే వ్యక్తులు రెవెన్యూ పొలమే కాకుండా అటవీ ప్రాంతంలోకి కూడా చొచ్చుకొని పోయి చదును చేశారని ఆయన తెలిపారు. వారంలో ఒకరోజు ప్రతి గ్రామంలో పర్యటించి ప్రభుత్వ భూములపై నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లయితే చూసి స్వాధీనం చేసుకుని ఆక్రమించిన వారిపై కేసులు పెట్టి కఠినచర్యలు తీసుకుంటామని తహశిల్దారు మురళీకృష్ణ హెచ్చరించారు.

## సబ్‌సెంటర్‌ను పరిశీలిస్తున్న క్యాడ్ అధికారులు

నందలూరు, ఫిబ్రవరి 14



ప్రభాతవార్త

నందలూరు మండలంలోని అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన కడప క్రికెట్ అసోసియేషన్ సబ్‌సెంటర్‌ను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కడప డిస్టిక్(క్యాడ్) డిఒసి ఖాజామొహిద్దీన్, మహిళా క్రికెట్ ఇన్‌ఛార్జి, ఇసి మెంబర్ వీఘ పురుషుల క్యాడ్ అఫెక్స్ మెంబర్ దౌలా, ఐపిఎల్ రంజీ క్రీడాకారుడు విజయ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందలూరు సబ్‌సెంటర్‌లో క్రీడాకారులకు అనువుగా అవసరమైన మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒక సిమెంట్ వికెట్, కొత్త ఆస్ట్రోవికెట్‌ను వేస్తామని వారు తెలిపారు. మహిళా క్రికెట్ క్రీడాకారులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే సబ్‌సెంటర్‌లోని మంచి క్రీడాకారులను గుర్తించి జిల్లాస్థాయిలో ఎంపిక చేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిఎ వీడియోఅనలిస్టు రెహమాన్, సబ్‌సెంటర్ కోచ్‌లు గయాజ్, ఫిరోజ్‌ఖాన్‌లోడి, ట్రైనర్ యేల్చూరి శివకోటి, పిచ్ క్యూరేటర్ హరిక్రిష్ణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## అత్తిరాలలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

**సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్**



అత్తిరాల బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అత్తిరాల ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్, ఇతర అధికారులు

రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

ప్రసిద్ధి చెందిన అత్తిరాల త్రేతేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సభాభవణంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలపై సబ్‌కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ శివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలివస్తారని, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్‌టిసి అధికారులు భక్తులకు సౌకర్యంగా బస్సులు నడపాలని కోరారు. విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఆలయ పాలకవర్గం, సభ్యులు, దేవాదాయశాఖ ఇఒ కొండారెడ్డిలు దుశ్శాలువతో సన్మానించారు. అత్తిరాల మడుగు పరిసర ప్రాంతాల్లో సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు బందోబస్తుపై ఎస్ఐ బత్సవత్సలం సబ్‌కలెక్టర్‌కు వివరించారు. ఆలయంలో ఏర్పాట్ల గురించి తహశిల్దారు సుబ్రమణ్యంరెడ్డి, ఎంపిడిఒ బాలముని స్వాములతో చర్చించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్‌కు ఆలయ మాజీ ఛైర్మన్, తెలుగుదేశంపార్టీ నేత సుబ్రమణ్యంనాయుడు ఉత్సవాల్లో ఆలయానికి లక్షల రూపాయల ఆదాయం వస్తున్నా భక్తులకు కనీస సౌకర్యాలు సమకూర్చడంలేదని ఫిర్యాదు చేశారు. ప్రతి ఉత్సవాల్లో దాతలు సమకూర్చే వాటిని తాము సమకూర్చినట్లు రికార్డుల్లో నమోదు చేసి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ యేడాది ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

## పలు సచివాలయాలలో గృహ సారథులకు కిట్లు పంపిణీ

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 14



ప్రభాతవార్త :

మున్సిపాలిటీ పరిధిలోని సిద్దవటం రోడ్ శ్రీకృష్ణ దేవరాయ నగర్ సచివాలయంలో 12,13,14,16,17 వార్డు సచివాలయాల గృహ సారథులకు, కన్వీనర్లకు మా నమ్మకం నువ్వే జగనన్న అనే కిట్లను మున్సిపల్ కన్వీనర్ యద్దారెడ్డి, కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణ, వెంకట కృష్ణ మరియు సరిటాల మౌలాలి, నిమ్మకాయల శివా రెడ్డి, తోటా నాగేశ్వరరావు, షఫి చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా వార్డు వాలంటీర్లతో పాటు గృహ సారథులు, బూత్ కన్వీనర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పెసల శ్రీకాంత్ రెడ్డి, డీలర్ వెంకటేశ్వర్లు (బుజ్జి), నిమ్మకాయల సావిత్రితో పాటు పలువురు పాల్గొన్నారు.

## నాడు నేడు పాఠశాలలను పరిశీలించిన ఇఇ మురళీధరన్

రామాపురం.

ఫిబ్రవరి14



ప్రభాతవార్త

మండలంలోని కసిరెడ్డిగారివల్లి పంచాయతీ కొత్తపల్లిలో నాడు నేడు కింద చేపట్టిన అంగన్‌వాడీ భవనం సమగ్ర సర్వశిక్షా అభియాన్ నిధులతో చేపడుతున్న ప్రాథమిక పాఠశాల భవనా నిర్మాణాలు పనులు హసనాపురం పంచాయతీ వడ్డెపల్లి, చీకటి వాండ్లపల్లి గ్రామాలలో జరుగుతున్న నాడు నేడు పాఠశాలలను మంగళవారం ఇఇ మురళీధరన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అంగన్‌వాడీ భవన నిర్మాణాల పనులు నాణ్యతతో కూడిన పనులు చేయాలన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి బిల్లులు పొందాలన్నారు. నాణ్యత ప్రమాణాలుతో పనులు చేపట్టాలని సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఈ జిలాని, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ విశ్వనాధ్ పాల్గొన్నారు.

## సైకిల్ తొక్కండి ఆరోగ్యంగా ఉండండి

**హెచ్‌ఎం రంగనాధరెడ్డి**

పీలేరు, ఫిబ్రవరి 14



ప్రభాతవార్త:

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశం మేరకు రేగళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్ కుమార్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ కింద హెల్త్ అండ్‌వెల్నెస్ సెంటర్సు నందు ప్రివెంటివ్ అండ్ ప్రమోటివ్ ఆరోగ్యసేవలు యొక్క అవగాహన కొరకు మంగళవారం సైకిల్ ఫార్ హెల్త్ అనే నినాదంతో సైకిల్ ఫార్ హెల్త్ అనే నినాదంతో ర్యాలీని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రంగనాధరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక శ్రమ లోపించడం వలన ఉబకాయం, మధుమోహం, అధిక రక్తపోటు, క్యాన్సర్, ఒత్తిడి, నిద్రలేమి లాంటి వ్యాధులకు గురవడం జరుగుతుంది. తద్వారా చిన్న వయస్సులోనే గుండెజబ్బులు, గుండెపోటు, కాన్సర్‌కు గురై చిన్నవయస్సులోనే మరణాలు సంభవిస్తున్నవి కావున ప్రతి రోజు కనీసం శారీరక వ్యాయామం చేయడం వలన బరువు కంట్రోల్ అవుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎర్రయ్య, ఉష, కిరణ్‌కుమార్, ఉషారాణి పవన్‌కుమార్, మోహన్, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశ సేవలో అమరులైన జవాన్లకు ఘన నివాళి

పీలేరు, ఫిబ్రవరి 14



ప్రభాతవార్త:

కలికిరి మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైఎస్సార్ విద్యార్థివిభాగం నాయకులు మలతోటి నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా బ్లాక్‌డే జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 14 అంటే ప్రపంచవ్యాప్తంగా వాలంటెన్సుడే జరుపుకుంటారేమో తెలియదు కానీ భారతదేశ చరిత్రలో మాత్రం ఇది ఒక చీకటిరోజు, సరిగ్గా నాలుగేళ్ల క్రితం ఇదే రోజున భారత భద్రతా బలగాలపై ఉగ్రవాదులు అత్యంత హేయమైన విధంగా దాడికి పాల్పడ్డారు. ఈదాడిలో ఏకంగా 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు దేశ రక్షణలో భాగంగా విధులకు వెళుతూ అమరులైయ్యారు. 2019 ఫిబ్రవరి 14 మధ్యాహ్నం పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులు సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న బస్సుల మీద దాడికి పాల్పడ్డారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాలని భావించిన భారత్.. అందుకు మరోసారి సర్జికల్ స్ట్రయిక్స్‌ను ఎంచుకుంది. ఫిబ్రవరి 26 తెల్లవారుజామున సరిహద్దులు దాటి పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లిన భారత వాయుసేన విమానాలు, బాలాకోట్‌లోని జైషే మహమ్మద్ ఉగ్రవాద స్థావారాలపై విరుచుకుపడ్డాయి. ఈఎయిర్ స్ట్రయిక్స్‌లో దాదాపు 300 మంది ఉగ్రవాదులు హతమైయ్యారు. 40 ఏళ్ల తరువాత పాక్ భూభాగంలోకి భారత్ యుద్ధ విమానాలు చొచ్చుకెల్లడం ఇదే లొలిసారి అని తెలియజేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప, అధ్యాపకులు మోహన్‌రెడ్డి, రమణయ్య, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వ్యాయామం,యోగాతో ఆరోగ్యం

రాజుపాళెం,ఫిబ్రవరి14,ప్రభాతవార్త.



ఆరోగ్యానికి భరోసా, ప్రగతికి హామి, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యమేళా వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండల పరిదిలోని గ్రామగ్రామానా పాఠా శాలలో వైద్యాధికారులు, సిబ్బంది వ్యాయామంతో శారీరక దృఢత్వం, యోగాతో మానసిక ఉల్లాసం పొందవచ్చని తెలియజేశారు.నేటి సమాజంలో మానవుడికి సంపూర్ణ ఆరోగ్యంను అందించుటకు వ్యాయామం,యోగ తప్పక చేయాలని దీంతో మానసికంగా,శారీరకంగా ఆరోగ్యంను పొందవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టరు మంజుల,డాక్టరు నిఖిలలతోపాటు రవి శంకరరాజు,విమలమ్మ,లక్ష్మీనారాయణ, శివరామంజ ఏయన్‌యంలు, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులందరూ కనీస సామర్థ్యాలు కలిగి ఉండాలి

సంబేపల్లి.ఫిబ్రవరి14



ప్రభాతవార్త

పాఠశాలలో చదివే విద్యార్థులందరూ కనీస సామర్థ్యాలు కలిగి ఉండాలని లిప్ రాష్ట్ర పరిశీలకులు విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉదయం సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న అభ్యసనా అభివృద్ధి కార్యక్రమాన్ని పరిశీలించారు. కోవిడ్ కారణంగా పాఠశాలలు చాలా రోజులు మూత పడి ఉండడంతో విద్యార్థుల సామర్థ్యాలపై ప్రతికూల ప్రభావం పడిందన్నారు. ఈ కారణంచేత ప్రభుత్వం విద్యార్థులలో కనీస విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి లిప్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇందుకోసం ప్రారంభ పరీక్ష నెలవారి పరీక్షలు నిర్వహించాలన్నారు. బోధనతో పాటు సాధనకు ప్రాధన్యత ఉండాలన్నారు. మార్చి చివరినాటికి విద్యార్థులందరూ చదవడం, రాయడం, అంకగణీతములందు సంపూర్ణ సామర్థ్యాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, డిస్టిక్ రిసోర్స్ పర్సన్ శంకరయ్య, ఉపాధ్యాయులు,

## టూరిజం పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన ఎస్పీ

ఒంటిమిట్ట, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:



స్థానిక కోదండరామాలయం వద్ద మంగళవారం టూరిజం పోలీస్ స్టేషన్ ను ఎస్పీ అన్బురాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూఎంతో అభివృద్ధి చెందిన కోదండ రామాలయాని కి పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నరని వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వారికి అన్ని రకాల సహయసహకారాలు అందించేందుకు టూరిజం పోలీస్ స్టేషన్ నందుఒక హెడ్‌కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుల్‌లు ఆందుబాటులో వుంటారన్నారు. ఈ కార్యక్రమంలో కడప డిఎస్‌పి వెంకటశివారెడ్డి, సిఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, సిద్దవటం యస్ఐతులసి నాగప్రసాద్,మండల పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజి వ్యవస్థను అద్భుతంగా రూపొందిస్తాం

**ధ్వజారెడ్డి, తోట శివసాయిలు**

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 14



ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని పాతబజారు నందు డ్రైనేజి వ్యవస్థను పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తామని రైల్వేకోడూరు ఉప మండలాధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయిలు అన్నారు. ఈ సందర్భంగా పాతబజారులోని డ్రైనేజి వ్యవస్థను ఆయన పరిశీలించి పూర్తిస్థాయిలో ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో పూర్తిస్థాయిలో డ్రైనేజి వ్యవస్థను అత్యాధునికంగా రూపొందిస్తున్నామని వారు అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజి ఉన్నా లేనివిధంగా సంబంధిత ఆర్యవైశ్యులు దానిని రూపుమాపారని, అలా కాకుండా డ్రైనేజిని అద్భుతంగా రూపొందించి వారికి అనుకూలంగా డ్రైనేజిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. విశాలంగా ఆర్యవైశ్యుల వీధిని ఆధునీకరించి భారీ నిర్మాణాన్ని చేపడుతున్నామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైల్వేకోడూరు పట్టణంలో డ్రైనేజి వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అధ్యక్షులు గునిశెట్టి రమేష్, భ్రమరాంబ, గునిశెట్టి సాయి, కొప్పరపు నరసింహులు, మేడా వెంకట సుబ్బయ్య, మల్లెంకొండు నవీన్, సర్పంచ్ శివయ్య, రమేష్ హరి పాల్గొన్నారు.

## రాయచోటిలో ఘనంగా మెగా సైక్లోతాన్ ఈవెంట్

**-అదనపు డిఎంహెచ్‌వో డా.శైలజ**

రాయచోట, ఫిబ్రవరి14



ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఘనంగా మెగా సైక్లోతాన్ ఈవెంట్ వేడుకలు నిర్వహించడం జరిగిందని అదనపు డిఎంహెచ్‌వో డా.శైలజ అన్నారు. ఈ సందర్భంగా డా.శైలజ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్యాక్రమంలో భాగంగా ఈరోజు దేశవ్యాప్తంగా ప్రతి హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో ఉచిత అసంక్రమిత వ్యాధుల మెడికల్ క్యాంప్ నిర్వహించి షుగర్, బిపి. గుండె జబ్బులు, థైరాయిడ్, కాన్సర్, పక్షవాతం, వంటి వాటిని తొలిదశలోనే గుర్తించి చికిత్స ప్రారంభించడం జరగుతుంది. జీవనశైలిలో మార్పులు పాటించడం వల్ల ఆరోగ్యం పొందవచ్చును. డిఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సైకిల్ ర్యాలీని నినాదాలు చేస్తూ నిర్వహించారు. జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డా.శేషగిరి బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 374 హెల్త్ వెల్నెస్ సెంటర్స్ ఉన్నాయని ఈ కేంద్రాలలో ఒక ఎం.ఎల్.హెచ్.పి/సిహెచ్‌వో ఉంటారని వారు 67 రకాల మందులు, 14 రకాల పరీక్షలు అవసరమైన వారికి చేస్తారని తెలిపారు. ప్రతి పౌరుడు వారి జీవన శైలిలో భాగంగా సైకిల్ తొక్కడం వల్ల స్ట్రెస్, గుండె జబ్బులు రాకుండా రక్షణ పొందవచ్చు. ప్రతి రోజు నడక, ఎక్కువగా ఆకుకూరలు తీసుకోవడం, నీరు త్రాగడం వల్ల శరీరం ఆరోగ్యానికి ఫిట్ అవుతుందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ప్రతి నెలా ఆరోగ్య కేంద్రంలో హెల్త్ మేళా నిర్వహించి అన్ని రకాల అసంక్రమిత వ్యాధులు పై స్క్రీనింగ్ చేస్తారని అన్నారు. జీవనశైలిని మార్చుకుందాం, ఆరోగ్యాన్ని పొందుదాం అన్నారు. అనంతరం సైకిల్ ర్యాలీ నినాదాలు చేస్తూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఐఒ డా.ఉషశ్రీ, డిప్యూటి డిఎంహెచ్‌వో డా.మధుసూధన్‌రెడ్డి, డిఎన్ఎంఒ డా.విష్ణువర్ధన్‌రెడ్డి, డిఎంవోవేణుగోపాల్, ఎస్ఓ ఓబుల్‌రెడ్డి, హెచ్ఈవో సత్యనారాయణ, సిహెచ్‌వో యాదవ్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, పర్యవేక్షకులు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నేషనల్ టెస్ట్ ఇంగ్లీష్ ప్రోగ్రాం నిర్వహణ

రాయచోటి.ఫిబ్రవరి14



ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నాడు ఇంటర్నేషనల్ టెస్ట్ ఇంగ్లీష్ ప్రోగ్రాం కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ వారి ఆద్వర్యంలో 45 రోజులు పాటు ఇంగ్లీష్ కమ్యునికేషన్ స్కిల్స్ అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహిస్తారని కార్పోరేట్ ట్రైనర్, రిసోర్స్‌పర్సన్ డేనియర్ సాంసన్ వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఇంజనీరింగ్ విద్యార్థిని విద్యార్థులు విదేశాలలో ఉన్నత విద్య కోసం అవసరమగు ఐఈఎల్‌టిఎస్ అర్హత పరీక్షకు దోహదపడుతుందని తెలియజేశారు. శ్రీసాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ఉచిత ఇంటర్నేషనల్ టెస్ట్ ఇంగ్లీష్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకుని లబ్దిపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంతో పాటు అర్థమెటిక్ రీజనింగ్ వంటి అంశాలపై శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.వి.బాలాజి, వివిధ విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మామిడి పూత, పిందె సస్యరక్షణ చర్యలపై రైతులుకు శిక్షణ

**-ఉద్యానశాఖ అధికారిణి నాగమణి**

గాలివీడు.ఫిబ్రవరి14 ప్రభాతవార్త



మామిడి పూత మరియు పిందె దశలో రైతులు చేపట్టవలసిన కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఉద్యానవన శాఖ అధికారిణి టి.నాగమణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నూలివీడు, సిసి పల్లె గ్రామంలో మామిడి పూత మరియు పిందె సమయంలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెల్లపూత దశలో ఎలాంటి రసాయన మందులు పిచికారి చేయకూడదని తెలిపారు. మామిడి నల్ల పూత దశ అనగా పిందె బఠాణి గింజ సైజులో ఉన్నప్పుడు ఆశించే తేనె మంచు పురుగు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు, మరియు పిందె రాలడం నివారణకు థయోమిథక్సిన్ 0.3 గ్రాములు లీటర్ నీటికి మరియు రోకో ఒక గ్రాము లీటర్ నీటికి మరియు ప్లానోఫిక్స్ 0.25 మి.లీ లీటర్ నీటికి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సహాయకురాలు రాణా ప్రతాప్, వికాస్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి : డా.వినయ్‌బాబు

వీరబల్లి.ఫిబ్రవరి14 ప్రభాతవార్త



మండలంలోని ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డా.వినయ్ బాబు తెలిపారు. ఆయన ప్రభాత వార్తతో మాట్లాడుతూ నేడు రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు అనే కార్యక్రమం ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎంతో అభివృద్ధి చేశారు. ప్రవేట్ ఆసుపత్రికి ధీటుగా అన్ని జబ్బులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. జబ్బులకు సంబందించిన మాత్రలు మందులు, సంవృద్ధిగా ఉన్నాయన్నారు. జబ్బులను బట్టి మెరుగయిన వైద్యం కోసం కడప లేదా తిరుపతికి సిఫార్సు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్యం చేయుటకు ఆశ వర్కర్లు, నర్సులు ఉన్నారు. బాలింతలకు, గర్భవతులుకు ప్రత్యేకంగా కాన్పులు వీలైనంత వరకు ఇక్కడే చేయడం జరుగుతుందన్నారు. ఆపరేషన్‌లు అవసరమైతే ఆరోగ్య శ్రీ ద్వారా గుర్తింపు పొందిన ఆసుపత్రికి పంపడం జరుగుతుందన్నారు. కాబట్టి మండలంలో ప్రజలు ప్రభుత్వ వైద్యం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## యోగా చేద్దాం... ఒత్తిడిని తగ్గించుకొందాం

పుల్లంపేట, ఫిబ్రవరి 14




సైకిల్‌ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభాతవార్త

యోగా చేద్దాం... ఒత్తిడిని తగ్గించుకొందామంటూ పుల్లంపేట మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం అధికారి ఎస్.శేఖర్ అన్నారు. ఆరోగ్యమేళ కార్యక్రమంలో భాగంగా మండల ఆరోగ్య కేంద్రం నుంచి మెగా సైక్లోతూన్ ఈవెంట్ ర్యాలీ కార్యక్రమాన్ని డాక్టర్‌తో పాటు మరో డాక్టర్ మనోజ్‌చంద్ర, ఎంపిడిఒ ప్రకాష్, స్థానిక సిహెచ్‌ఒ రాజా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో శాంతినికేతన్, శ్రీప్రత్యూష పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థిని విద్యార్థులతో పుల్లంపేట పురవీధుల్లో సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కార్యక్రమం నందు డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల శారీరక బరువు తగ్గవచ్చునని, మానసిక ఒత్తిడిని, ధీర్ఘకాలిక వ్యాధులైన గుండెజబ్బులు, క్యాన్సర్‌లాంటి వ్యాధులను నియంత్రించవచ్చునని అన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా సైక్లోతూన్ వ్యాయామం చేయడం వల్ల ఉత్సాహం, ఉత్తేజంతో పాటు మంచి నిద్ర వల్ల అంటువ్యాధులు దరిచేరవని ఆయన పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పాఠశాల విద్యార్థులచే సైక్లింగ్ చేస్తాం.. ఉల్లాసంగా ఉందాం... ఆకు కూరలు తిందాం... ఆరోగ్యంగా ఉందాం... యోగా చేద్దాం... ఒత్తిడిని తగ్గించుకొందాం.. మాంసాహారం వద్దు.. శాఖాహారం ముద్దు అనే నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్లోగన్‌లను వినిపించారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు పారామెడికల్ సిబ్బంది, సూపర్‌వైజర్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.